# కొత్తచూపు

"చిత్తగించారూ ? మీ అల్లుడుగారు, అగ్రహారందారూ, గొప్ప వంశానికి చెందినవారున్నూ. అనేకమంది అగ్రహారం దార్లలాగ కాక, స్వయంగా వారు పండితులు కూడా. ఈ జిల్లా బ్రాహ్మణ్యాని కంతకీ భూషణం అని, వారికి, మా జిల్లాలోకూడా చాలా ప్రఖ్యాతి వుంది. అంచేత, వారూ మేమూ వియ్యం అందడం బంగారానికి పరిమళం అబ్బడమే. కనక, వరకట్నం యింత కావా లని వారిని నేను నిక్కచ్చి చెయ్యాను. చెయ్యానే లేదు. నాకు కావలసింది, గౌరవమూ మర్యాదాను, డబ్బు కాదు. అయితే, నే నిప్పుడు మనవిచేసుకునేది ఒక రిస్తామన్న మొత్తం మాత్రమే. అదయినా, నేను బేరమాడి స్థిరపరుచుకున్నది కాదు, వస్తూనే వారే సెలవిప్పించింది. ఈవిషయం నే నిప్పు డెందుకు ప్రస్తావించవలసి వచ్చిం దంటే? ఇక్కడ మీ రెంత యిచ్చినా: నేను ఒప్పుకుంటా ననుకోండి; కాని కీడెంచి మేలెంచ మన్నట్టు మీ రిచ్చేది, వారిస్తామన్న దానికంటే తక్కువ అవుతుం దనుకోండి. అయినా, నేను మనస్పూర్తిగానే ఆనందిస్తాను; కాని, అలా జరిగితే, ఆ గృహస్థు "ను వ్వేమన్న పెద్దమనిషి వయ్యా?" అని నన్నే నడివీధిలోనో నిలబెడితే నే నేమిటీ చెయ్యడం? అటు గౌరవమూ పోయి, ఇటు — ఏమంటారు?"

అనడిగాడు పెళ్లికొడుకు తండ్రి, మొగం అంతా జాలి చేసుకుని.

“చిత్తం చిత్తం, మీరు సెలవిప్పించినదాల్లో యేమీ తేడా లేదు. అయితే, మీరు నిక్కచ్చి చేసినా, ఆశించినా, మేమే యిస్తామని యెదురుచూసినా, మీకు తృప్తి కావాలంటే వారికంటే మే మెక్కువే యిచ్చుకోవాలిగదా? కనక, సెలవిప్పించండి” అన్నాడు, పెళ్ళికూతురి మాతామహుడు భైరవసోమయాజి.

“ఒక వేళ మీ రివ్వతలిచిందే యెక్కువ అవుతుందేమో? ఇక, మనం స్వల్పవిషయాలు తవ్వుకోడం యేమి సొగసూ?”

“అమ్మమ్మా, మీ రలా సెలవిప్పించడం ధర్మమా? ఆవొకరి సాహసం కంటే మీ ఔదార్యం యెంత గొప్పదో చూసుకుని మే మానందించడానికయినా మీ రది చెప్పవలసే వుంటుంది కదా?”

“ఇంతకీ:- మీ అల్లుడుగారు దయచేశారు కారు. వారు వచ్చాక మళ్ళీ చెప్పడం కంటే —”

“ఎందుకూ? నేను మనవిచేసుకున్నాను కాదూ; అతను చిన్నవాడండీ! అయినా, యజమాని కనక, లాంఛనప్రాయంగా శ్రుతపరచడం – అంతే. ఇక్కడి వ్యవహారాలన్నీ నాచేతిమీదుగానే నడుస్తూ వుంటాయి. మీరు మళ్ళీ శ్రమపడవలసిన అగత్యం యెంతమాత్రమూ వుండదు, నాది పూచీ, సరా?”

"వారన్ని విధాల సెలవిప్పిస్తూ వుంటే సందేహం యెందుకూ, మన అభిప్రాయం చెప్పెయ్యవయ్యా బావా" అన్నాడు పెళ్ళికొడుకు మేనమామ.

"అలాగే, సందేహం యేముందీ యిందులో? మన అభిప్రాయం అంటే అవతలివా రిచ్చుకుంటా మన్నది కదా, వారి మాట శుకానువాదం చెయ్యడంలో మనకి ప్రత్యవాయం మాత్రం యేమి వుందీ?"

"అదే నా మనవిన్నీ. ఏమంటే? వా రిస్తా మన్నదీ, మేమివ్వతలిచిందీ యేమయినా, మీరు నిశ్చయించుకున్నది—"

"మీరు భ్రాంతిపడుతున్నారు. మేము నిశ్చయించుకున్నది లేనే లేదు"

"ఒక్కటి చిత్తగించండీ! వరకట్నం పుచ్చుకోకుండా మీరు మానునమరాలిని చేసుకుంటారా?"

"వరకట్నం యివ్వకుండా మీరు వరుణ్ణి తేదలుచుకున్నారా?"

"కనక?"

"ఇక మన కా ప్రస్తావన యెందుకూ?"

"అదే నా మనవిన్నీ"

"సరే, చిత్తగించండి మనవిచేస్తాను. ఒకానొక సంపన్న గృహస్థు సమర్పించుకుంటా నన్న వరకట్నం పదకొండువేల నూటపదహారు రూపాయిలు. అందులో సగం తాంబూలాల సమయానా, తక్కింది లగ్నంవేళా చెల్లించే నిర్ణయం. అప్ప గింతల వేళ, వచ్చిన స్త్రీపురుషులకు, ఆబాలగోపాలమూ

మీా, మా, దర్జాలకు తగివుండేటట్టు మా జాపితాప్రకారం నూతనవస్త్రాలు మూటకట్టి విడిదిలో నా కప్పగింత పెట్టడం. మే మిక్కడికి తరలిరావడాని కయే ఖర్చులు, మా బిల్లు ప్రకారం మాకు ముదరాయివ్వడం. వెళ్ళేటప్పుడు మాఖర్చులు మాత్రం మావే లెండి, మీాకు పూచీ లేదు. బాజాభజం త్రీలూ, పాలకీబోయీాలూ, భోగం మేళమూ, నూతో మేము తీసుకు తెచ్చుకునే యిద్దరు వంటబ్రాహ్మలూ, యిద్దరు పేరంటాళ్ళూ—వీరి కివ్వవలసిందిన్నీ మాకు చెల్లగట్టడం. ఇవి నాతో వ్యవహారించవలసిన ముఖ్యాంశాలు. చిల్లరమల్లరలు మనం యెప్పటి కప్పుడే పరిష్కారం చేసుకుంటూ వుండవచ్చును. దాని కేం లెండి. ఇక వియ్యపురాలి విషయమూ, ఆడబడుచు విషయమూ వున్నాయి. ఆసంగతులు నిశ్చయించుకోవలసిన వాడు మా భామమరిది .. చెప్పవయ్యా"

"అవిన్నీ వొక రిస్తా మన్న వేనా?" అనడిగాడు సోమయాజి.

"బంధుత్వం కలుపుకునేటప్పుడు మనకి దాపరికా లెందుకూ? వారికీ మాకూ కొద్దిపాటి తేడా లేకపోలేదు. కనక, తాము మరోమాటు ఆలోచించుకునేదాకా – అంటే తమ మాట పుచ్చుకోకుండా మరోసంబంధం చూసుకోవద్దని మమ్మల్ని వారు చాలా ప్రార్థించారు లెండి. అయితే, –"

"ఇప్పుడు మనం యేమీా నిరారణ చేసుకోడానికి వీలు లేదన్న మాట"

"అమ్మమ్మా, ఎంతమాటా? మీా సంబంధం కుదిరితే ఇంకా యింకా యిస్తామన్నా వారు మాకెందుకూ?"

"సరే, నాసందేహం యేమిటంటే? ఇక మీ భావ మరిదిగారు సెలవిచ్చేది వారిస్తా మన్నదా మీరు నిశ్చయించుకున్నారా?"

"ఏమంటావోయ్?"

"అయ్యా, ఈవిషయమై మా బావగారి ప్రమేయం లేశమూ లే" దంటూ అందుకున్నాడు, మేనమామ.

"నేను మనవిచేసుకునే దేమిటంటే? వియ్యాపురాలికీ ఆడబడుచుకీ కలిపి వెయ్యినూటపదహార్లని వారూ, ఎవరికి వారికే వెయ్యిన్నూటపదహార్లని మేమూను. ఈవొక్క విషయమే వారు మళ్ళీ ఆలోచించుకోవా లన్నది. మా అక్కగారి కొక్క కొడుకూ వొక్క కూతురూను. అల్లారుముద్దుగా పెంచుకుంటోంది, ఎన్నాళ్ళుగానో ఊటలునూరుతోంది, మా అక్క, ఆవిడ తనకి ముచ్చట్లు బాగా తీరాలని ఆశించడంలో తప్పేముందీ? మా మేనగోడలికయినా మళ్ళీమళ్ళీ తీరే అవకాశం లేదుకదా? అంచేత, అయిదు రోజులూ, ఇద్దరికీ, రోజు కొక్కొక్క పెద్దకాసు బొట్టుపెట్టాలి. ఒక్కొక్క బెంగుళూరి చీర కట్టబెట్టాలి –"

మాట సగంలో కలగజేసుకుని "ఇదిగో, చూడూ, అగ్రహారీకులతోపని, అవనీ, అది కాదనీ తరవాత కీచులాడుకోడం నేను సహించను. నూలుచీరలు పనికిరావు, మేలురకం పట్టుచీర లని స్పష్టంగా చెప్పు" అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి, నిష్ఠురంగా.

"మీరు చెప్పేశారుగా?... అయ్యా, ఇక మీరు ముందుకి వెళ్ళండి"

"చిత్తం చిత్తం, అప్పగింతలవేళ, ఇద్దరికీ అత్తాకోడళ్ళ అంచుల నేలం పట్టుచీర లివ్వాలి. మనుగుడుపుల్లో కూడా రోజు కొక్కొక్క చీర కట్టబెట్టాలి. ఈవిషయమై మొదట కొంచెం తర్జనభర్జన జరిగింది; కాని చివరి కుభయులమూ ఒక నిశ్చయానికి వచ్చాం. దాని ప్రకారం, మొదటి రెండు రోజులూ మేలురకం పుల్లంపేట జరీచీర లివ్వడం. మూడో నాడు మాత్రం బొంబాయి పట్టుచీర లివ్వాలి సుమండీ! కాళ్ళు కడుగుచెంబూ, పళ్ళేలూ, పానకం బిందెలూ – ఇవి వారిదివరకే వెండివి తయారుచేయించుకుని వున్నారు. మేము వెండి బొట్టుపెట్టే, బంగారపు కుంకుమభరణీ కూడా చేయించాలన్నాం, వారు సరే అన్నారు. మధురపట్టుచీరతో వుయ్యాలా, బెంగుళూరి పట్టుచీరతో వొడికట్టూ – ఇవిన్నీ వారంగీకరించారు. ఇక తక్కినవి స్వల్పవిషయాలు. అవి జరగడమేప్రధానం. విలవలు మీ దర్జాని పట్టి నిర్ణయించుకో వచ్చు. నిర్ధారణ అక్కరలేదు. ఎటొచ్చీ – అయిదు రోజులూ, మా అక్కా మేనకోడలూ పెళ్ళివారి యింటికి వస్తూ వెడుతూ వుండడానికి విడిదిలో రెండు మేనా లెప్పుడూ సిద్ధంగా వుండాలి. ఇది మాత్రం చాలా ముఖ్యం సుమండీ"

ఈమాట చాలా వొత్తి చెప్పాడు మేనమామ.

"చిత్తం" అంటూ అంతకంటే గట్టిగా తలవూపాడు సోమయాజి, కుండలాలు ఎగిసిపడేలాగ.

"ఇక మావిషయం" అంటూ అవ్యవధానంగా అందుకున్నాడు, ఆడబడుచు మొగుడు.

అది విని సోమయాజి వులిక్కిపడగా "అంటే బంధువుల విషయం లెండి" అంటూ సర్దిచెప్పి ప్రారంభించా డతను.

"అమాంబాపతూ మేము నూటయ్యాభైమంది దాకా వస్తాం. ఏకొద్దిమందో తప్ప అందరూ ఇంటరుతరగతిలో వస్తాం. పెళ్లికొడుకు ఫస్టుక్లాసులో వస్తాడు — "

మళ్లీ మాట సగంలో అందుకుని "అదే మన్నమాటా? మావాడు నిన్ను విడిచి తా నొక్కడూ సెకండు క్లాసులో వస్తాడూ? వివరంగా చెప్పు, నాకీ శషభిషలు పనికిరావు" అంటూ మూతి ముడుచుకుని చురుగ్గా చూశాడు పెళ్లికొడుకు తండ్రి.

దీనిమీద "వారు సెలవిచ్చారుగా? ఇక తక్కిన సంగతులు చెప్పండి మీరు" అన్నాడు సోమయాజి, చెయ్యూపుతూ.

"అందరికీ, అయిదు రోజులూ, పూటకి రెండు పిండి పిండివంటలతో పాటు మైసూరు రసమూ సాంబారూ విధిగా వుండాలి. పనసకాయా, వంకాయా, అరిటికాయా, గుమ్మడుకాయా, కందా, పెండలమూ — ఇలాంటి చచ్చుకూరలు పనికిరావు మాకు, — కేబేజీ, నూల్‌కూలూ, బీట్‌రూటూ, గాలీప్లవరూ — ఇలాంటివి పూటకి రెండు చేయించాలి. బంగాళాదుంపలు చిప్సుగా మాత్రమే చేయించాలి. ప్రతీ రోజూ పగలు పెరుగుపచ్చడీ, రాత్రి క్షీరాన్నమూ వుండాలి. రెండు పూట్లా పెరుగే కాని మాకు మజ్జిగ సుతరామూ పనికి రాదు. పొద్దు పొడిచాటప్పటికి కాఫీవుప్మాలూ, పొద్దు

వాలాటప్పటికి కొక తీపీ, ఒక కారమూ, టీ — ఇవి నిక్కచ్చిగా వుండాలి. తుని ఆకులే గాని ద్రాక్షారామ తమలపాకులు మాకు పనికిరావు. విడిదిలో నలుగురు వడ్డీమంగలెప్పుడూ సిద్ధంగా వుండాలి. రెండు జట్కాలున్నా హాజరు పెట్టి వుంచాలి. రోజు కొక రకం మంచి సబ్బుబిళ్లలు డజనూ, అరడజను చీట్లపేకలూ పంపుతూ వుండాలి. స్నానాలకు మాకు వేడినీళ్లే గాని చన్నీళ్లు పనికిరావు. ప్రతీరాత్రీ రెండయ్యేదాకా మేజువాణీ వుంటుంది, పన్నెండు గంటల వేళ సమృద్ధిగా టీ పంపుతూ వుండాలి. ఇది అగ్రహారం, మాకు తెలుసు, అయినా, పూటకు సిజర్సు డబ్బాలాగూ, బీడీకట్టలు పెద్దవి మూడూ, కేతకీమసాలా ఒక పౌనూ, బంగాళా ఆకులు నూరూ పంపుతూ వుండాలి. వీటికి మాత్రం రోజుకి పూటలు మూడు సుమండీ! ఫిల్టరుసోడా, కలహూ చాలా ముఖ్యం, మరిచిపోగూడదు. మిక్కిలీ ముఖ్యమైనది మరొక టుంది, భోగంవాళ్ల కిచ్చే బస చక్కగానూ, పరిశుభ్రంగానూ, విశాలంగానూ వుండాలి."

"చిత్తం చిత్తం, అన్నీ అయినట్టేనా?"

అల్లుడు మామగారికేసి చూశాడు.

"లేదు లేదు, కొంచెం తరవాయి వుంది. ఏదీ, నాయనా, నీముచ్చట్లు గూడా తాతగారికి మనవిచేసుకో. ఉభయులకూ వారు కావలసినవారే, సందేహించకు" అన్నాడు పెళ్లికొడుకుతో, తండ్రి.

"సందేహమా?" అంటూ వెంటనే అందుకున్నాడు పెళ్ళికొడుకు.

"హో! అది మన నిఘంటువులోనే లేదుగా? అయ్యా, వినండి. మఘుపర్కాలు మాత్రమే నేను పంచెలు పుచ్చుకుంటాను. తక్కినవన్నీ నాకు సిల్కుసూట్లూ ట్వీడ్డు సూట్లూ మాత్రమే యివ్వాలి —"

మాట కడ్డం వచ్చి "ప్రోల్లో కూడా పట్టుతాపితాలే పుచ్చుకోవాలి నాయనా, వల్లకా దనకూడదు" అని బుజ్జగించాడు తండ్రి.

"సరే, అదిన్నీ అలాగే కానిచ్చుకోవచ్చు. తరవాత మధుపర్కాలు మాత్రం నేను కట్టుకుంటాను కనకనా? పోగా, — నా కిచ్చే వెండికంచం రెండువందల యాభై తులాలూ, మరచెంబు రెండువందల తులాలూ వుండాలి. కంచం దగ్గిర పెట్టే ప్లేట్లూ, గిన్నెలూ, కాఫీసెట్టూ వాటికి తగ్గట్టే వుండాలి. మూడు రవ్వల వుంగరమూ, రాళ్ళు తాపిన రిస్టువాచీ, దానికి బంగారపుగొలుసూ, — రోల్డుగోల్డు ఎంత మాత్రమూ పనికిరాదు. తెలుసా? మంచిరకం రేడియో సెట్టూ, గ్రామోఫోనూ, ఇంగ్లీషు మేకు బట్టలబీరువా, బంగారపు సిగిరెట్టుకేసూ, — ఇవన్నీ లగ్నసమయాన యివ్వాలి. అలకపాన్పు మీద ఒకటో రకం టెన్నిస్ బాటూ, మోటారుసైకిలూ యివ్వాలి. ఇది పల్లెటూరు కనక, తప్పదంటే నే నొక్క వూరేగింపు సమయంలో మాత్రమే పాలకీ యెక్కుతాను. తక్కిన సమయాల్లో నాకోసం వొక కారెప్పుడూ సిద్ధంగా వుంచాలి. ఈవూళ్ళో నాకు కాలం గడవడం కష్టం, గనక, భోజనం కాగానే నే నే కాకినాడో

రాజమహేంద్రవరమో, చివరికి రామచంద్రపురమో వెళ్ళి వస్తూ వుండడాని కది చాలాముఖ్యం. మరిన్నీ, భోగంమేళం మేమిదివరకే మాట్లాడివుంచాం. అదే మీరు తీసుకురావాలి. మరోటి పనికిరాదు. ''

" బాగుంది నాయనా ! "

" అన్నట్టు, మంచి సేవింగుసెట్టు కూడా వొకటి అలక పాన్పుమీద నాకు సిద్ధంచేసి వుంచాలి సుమండీ "

" అదేమిటి నాయనా ? "

అది మీ అల్లుడుగారికి తెలుస్తుంది లెండి, నూరో నూట పాతికో పెడితే వస్తుంది, యేమంత భాగ్యం ? '' అని సద్ది చెప్పాడు, ఆడబడుచు మొగుడు.

అతను మాట పూర్తిచేశాడు.

అంతే.

గదిలో యేదో చప్పుడయింది.

పూసల జాలరు వెనక వున్న పట్టుతెర వొక పక్కకి జారుకుంది.

చూడగా,తోకమీద నిలిచిన వురగాంగనలాగ ద్వారంలో అన్నపూర్ణ నిలిచి వుంది.

మొదట అందరూ చకితుల యినారు.

" పెళ్లికూతురు " అన్నాడు కొండుశ్రౌతి, మెల్లిగా.

అందరూ అటు పరిశీలనగా చూశారు ; కాని పులుకూ పులుకూ చూస్తూ సోమయాజి మొగం చిట్లించుకున్నాడు.

చురచుర చూస్తూ యింతలో పెళ్లికొడుకు ఎదటికే వచ్చేసిం దామె, మెరుపుతీగ లాగ.

ఉలిక్కిపడి పెళ్లికొడుకు తండ్రీ, మేనమామా మొగ మొగాలు చూసుకున్నారు.

సోమయాజి బోసినోరు తెరుచుకుంది.

ఆడబడుచు మొగుడు వీపు గోకాడు; గాని గుంయి మన్నట్టయి పెళ్లికొడుకు చూపులు చెదరిపోయాయి.

అదీ అదీ కూడా కనిపెట్టేసింది అన్నపూర్ణ.

"మీ వాగ్ధోరణి చాలా సరసంగా వుంది. అది మీరు చదివిన చదువులకు ఫలితం" అందామె ఉత్తరక్షణంలోనే, పెళ్లికొడుకుతో.

కాని, అతనికి మాట రాలేదు.

"మీ అందరి షరతులూ చాలా గొప్పగా వున్నాయి. అది మీపూర్వుల తపస్సుకి ఫలితం"

"..... ..........."

"వాటి విషయమై మీరున్నారు, మా తాతగారున్నారు, యథేచ్ఛగా పరిష్కరించుకోవచ్చు. ఎవరూ అడ్డురారు"

"........ ....."

"మీరు నాకే చెప్పవలసిన సంగతి ఒకటుంది. అది మీరు మా తాతగారికి చెప్పకపోడం మీ యింగితజ్ఞానానికి గొప్ప గుర్తు"

"......... ......."

"నాకు జవాబు చెప్పండి. ఉత్తరభారతభూముల్లో భారతీయస్త్రీ లెందరో మానభంగాలకు పాల్పడ్డారు. ఉత్తరాంధ్రభూముల్లో మనవాళ్ల కెందరికో అలాంటిది తటస్థపడుతోంది.

తెనుగుస్త్రీల కిది చావుబతుకుల సమస్య. మే మిది చూసీ చూడకుండా విడిచిపెట్టడానికి వల్లకాదు. మరి, మీ కళ్ల యెదట మీ ఆత్మీయులకున్నూ అలాంటిది తటస్థపడితే, తరవాతి మాట యేమయినా, ముందు కళ్లు మూసుకుని మీరు శత్రువులమీద పడగలరా?"

ఇలా అడిగి కరుగ్గా చూసింది అన్నపూర్ణ.

దీంతో, అక్కడి వాతావరణం స్తంభించిపోయింది.

సోమయాజి సనాతనధర్మం కీచుమంది.

పెళ్ళికొడుక్కి నవనాడులూ కుంగిపోయాయి.

శ్రౌతి మాత్రం వూగిపోయాడు.

తక్కినవారికి మీది ప్రాణాలు మీదికే యెగిరిపోయాయి.

ఉండుండి "నాకు బదులు చెప్పా" లంది అన్నపూర్ణ.

చూసింది, చూసింది, గిరుక్కున మళ్ళీ లావణ్యాం కెరటం లాగ యింటోకి చక్కాపోయింది, గజగమన అయి.

పెళ్ళివారి కళ్ళకి పొరలు కమ్ముతున్నట్టు తెర విచ్చుకుంది. ఒక్కమాటు ఊగిసలాడి,

౨

చెమటలు కక్కుకుంటూ కళేబరం యింటోకి మోసుకు వెళ్ళాడు సోమయాజి.

చూడగా, కూతుర్ని పొదివిపట్టుకుని తన కూతురు రాజేశ్వరి "బిడియపడిపోతా వనుకున్నా నమ్మా" అంటూ ముద్దుచేస్తోంది, అలకలు సవరిస్తూ.

"నువ్వు చదివిన చదువు సార్థకం చేసుకున్నా వమ్మా" అంటూ ప్రశంసిస్తున్నాడు, దగ్గరగా నుంచుని రామశాస్త్రి, సగర్వంగా.

హాల్లో వీపుమీద పడ్డ పిడిగుద్దుకి, నెత్తిమీద మొట్టికాయ అయి జతపడిందిది సోమయాజికి.

జవజవలాడిపోయాడు బ్రాహ్మడు.

"నీగుణం నువ్వు పోనిచ్చుకున్నావు కావు" అన్నాడతను చివరికి పురపుర చూస్తూ.

"ఏమి టండీ మీ రనేదీ?" అంటూ యిటు తిరిగి వెంటనే యెదురుకున్నాడు శాస్త్రి.

తల్లి పొదిగిటనే వుండి విరగబడి చూసింది అన్నపూర్ణ.

"నేను నిన్ను రమ్మందాం అనుకుంటూ వుండగా పెళ్ళికూతురా రావడం? వచ్చినా పెళ్ళికూతు రయినది అలాగేనా మాట్లాడడం?" అంటూ గింజుకున్నాడు సోమయాజి.

"మీ రుండండి నాన్నగారూ" అంటూ తల్లి చేతులు విడిపించుకునీ, తండ్రిని తప్పించుకునీ పూచలాగ వచ్చి, తోక తొక్కిన తాచులాగ యెదట నుంచుని "నాకు పెళ్ళికొడుకుని మీరు చూడ్డం యేమిటి తాతగారూ?" అంటూ నిలేసింది అన్నపూర్ణ.

ఆ రూపమూ, ఆ చూపులూ భరించలేక కొయ్యాయిపోయాడు సోమయాజి "ఆ, ఆ" అంటూ వెనక్కి జంకి.

"ఇప్పటికి పాతిక సంబంధా లయినా చూశారు మీరు. ఇరవై మంది నయినా పెళ్ళికొడుకులను యింటిమీదికి తీసుకు

వచ్చారు. మరో పని లేదూ మీకూ? ఎవరు ప్రాధేయ పడ్డా రండీ యిలా అవస్థపడ మని మిమ్మల్నీ?"

అతనికి మాట రాలేదు.

"మీరు నాకోసం సంబంధాలు చూడ్డం మా నాన్నగారి కిష్టం లే దనీ, వారి సహనం అంతరించిపోయిందనీ, మీకు బోధ కావడానికి మరో మార్గం యేమి వుందండీ?"

కళ్ళల్లోకి మాత్రం ప్రాణాలు చేరుకున్నాయి, అప్పటి కతనికి మెల్లిగా.

"పోనీ అంటే, మీరు తెచ్చినవాళ్ళలో వొక్క డయినా మా నాన్నారు కాళ్ళు కడగతగ్గవా డున్నాడా?"

అప్పటికి గొంతుకు గుడగుడ లాడిం దతనికి.

గుడ్లు మిటకరించుకోగా మాట కూడా తిరిగింది.

"నేను తెచ్చినవాళ్ళందరూ అప్రాచ్యు లేనా? అయితే, యెలాంటివాడి కక్కడుగుతాడే మీ నాయన కాళ్ళు?"

"అలాంటివాళ్ళు మీకు దొరకరు"

"అయ్యో"

"చెప్పినా మీరు గుర్తించలేరు"

"అయినా, లక్షణాలు చెప్పు చూతాం"

"ఉలిక్కిపడకండి. ఇప్పుడు వరయోగ్యత నిర్ణయించ వలసినవారు మీరూ మీరు పురుషులు కారు"

"ఆ"

"తల పండిపోయిన మీవంటి వృద్ధు లసలే కారు"

"శ్రీహరి"

"మీ యుగం తిరిగిపోయింది. మీ చదువులు పనికిరావు. మీ నమ్మకాలిక చెల్లవు"

"అయ్యో, అయ్యో"

"మీ చూపుల కానని, మీ బుద్ధి కందని పరిధుల్లో వున్నాం మేమిప్పుడు. ఇక యుగధర్మం నిర్వచించవలసింది మేము"

"వినడానికీ మేము పనికిరాములే?"

"అవశ్యమూ వినవచ్చు. తక్కినవారి సంగతి యే మయినా, తెనుగు కన్యలం మేమిప్పుడు చూసుకోవలసిన వరయోగ్యత చక్కదనం కాదు. చదువూ కాదు. ఐశ్వర్యం కానే కాదు. ఇవన్ని తెనుగు యువతిని బానిసను చేశాయి. ఈలక్షణా లున్న తెనుగు యువకు లింతవరకూ చక్రవర్తులుగా చెలామణీ అయినారు; కాని అలాంటి వారిక వివాహానికి అర్హులు కారు"

"మరెవరే అర్హులు? వాళ్ళ యోగ్యత లేమిటే?"

"బతికివున్నంతకాలమూ జీవితంలో స్త్రీలు తమతో సహకరించుకోవా లంటే యువకు లిప్పుడు గడించుకోవలసిన యోగ్యతలు – శౌర్యం, బలపరాక్రమాలు, తెగబడి యుద్ధం చేసే ధైర్యం, వీలు తప్పితే పెళ్ళికూతుర్ని రాక్షసవివాహ పద్ధతిగా సంపాదించుకోవా లన్న చూపు, అందుకు తగ్గ సత్తా –"

ఆవేశం ముంచుకువచ్చి అన్నపూర్ణ మరి మాట్లాడలేక పోయింది.

రామశాస్త్రి మొగాన గర్వరేఖ మెరిసింది.

రాజేశ్వరి చూపుల్లో ఆనందం తరళితం అయింది.

ఉండుండి "మహా బాగా తయారుచేశావు కూతుర్ని" అంటూ రామశాస్త్రిని హేళనచేశాడు సోమయాజి, వూగీసలాడుతూనూ, చేతు లాడించుకుంటూనూ.

"నే నాశించినట్టు తయా రయింది నా కూతురు. అందరికీ యిలాంటి అదృష్టం పట్టదు తెలుసా?" అంటూ ముదలకించాడు శాస్త్రి.

"ఓ – హో"

"మీరు ఘనాపాఠీలే గాని అర్థజ్ఞానం లేక వేదంలో యేమి వుందో మీకు తెలియదు. విడమర్చి చెప్పినా మీకు బోధపడదు. వేదాన్నే మీరు గౌరవించతలుచుకుంటే వేదోక్తా లయిన లక్షణా లన్నీ వున్నాయి నా కూతురి దగ్గిర, చూసుకోండి"

"అలాగ టోయ్?"

"కాకేమండీ?"

"నాకేం తెలుసు నాయనా? మహా పండితుడవు నువ్వు"

"వేదజడునకు పాండిత్యం అంటే యేమి బోధపడుతుందీ? ద్రవ్యాశా, కొంపలు తీసే లౌక్యమూ వీటిలో మాత్రం మీరు నిధులు. మీ రిప్పుడు తెచ్చిన పెళ్లికొడుకు, అలకపాన్పుమీద తనకు మంచిరకం మంగలిపొది యివ్వా లంటే అందు కామోదించారు మీరు, ధర్మాధర్మాలు మీకేం తెలుసునండీ?'

మళ్లీ కొయ్యయిపోయాడు సోమయాజి.

"మీ రిప్పుడు తెచ్చిన కుఱ్ఱాడు, పెళ్లిలోనే ఆపూరాయా యీపూరాయా షికార్లు కొడతాట్ట, పెళ్లికూతుర్ని కూడా తన వెంట పంపా లంటా డేమో మీ కేమయినా యింగితజ్ఞానం వుందా."

"పోనీ, ఆకుఱ్ఱాడు అప్రాచ్యుడే అనుకో. ఇప్పటికే యిర్వై యేళ్లు నిండాయి గదా, పెళ్లి చెయ్యకుండా యింకా యెన్నాళ్లట్టేపెడతావు నీ కూతుర్ని ?" అనడిగాడు సోమయాజి, మాట మరిపించడానికి మొండిగా.

"బతికివుండినంతకాలమూ పెళ్లనేది యెరక్కుండా మహోజ్వలజీవితాలు గడిపిన నిత్యకన్యలతో పరమపవిత్రాలయినవి మన మహర్షుల కుటుంబాలు. ఆకుటుంబాలకు సంబంధించిన వాళ్లం మనం, మీ కిది తెలుసా ?"

గుండెలు పితపిత లాడిపోగా, అటు చూడలేక, కూతురికేసి చూశాడు సోమయాజి.

"నువ్వాయీతండ్రీకూతుళ్లతోనే కలిశావా ?" అనిన్నీ అడిగా డతను.

"అటు నా యిలవేల్పూ, యిటు నా కండలో కండానూ. ఏమీ కలిసిపోక ?" అని యెదు రడిగింది రాజేశ్వరి.

"నీకూ యీ పద్ధతులు నచ్చాయా అనడుగుతున్నాను"

"ఐశ్వర్యమే కనపడింది వారికి, నన్నిచ్చినప్పుడు మీకు; కాని నే నిప్పుడు దేవతాకుటుంబంలో పడ్డట్టు భావించుకుంటున్నాను, నాకు వారి పద్ధతులు నచ్చకేం ?"

రామశాస్త్రి మొగాన మళ్ళీ గర్వరేఖ మెరిసింది.

"ఏం, అయిందా?" అన్నట్టు డెకారిస్తూ చూసింది అన్నపూర్ణ.

చూసిచూసి "అయితే, యీ దేవతాకుటుంబంలో వుండడానికి నా కర్హత లేదు, ఇదిగో నేను వెళ్ళిపోతున్నా" నంటూ రుంజుకుని, పెద్ద నిట్టూర్పున్నూ విడిచి, కాళ్ళు అడ్డదిడ్డంగా వేసుకుంటూ తుర్రు మన్నాడు సోమయాజి.

తల్లీ కూతురూ గంభీరంగా చూసుకున్నారు.

కూతురి మొగం ఉత్సాహతరళితం కాగా, తల్లి హృదయం ఆనందతరంగితం అయింది.

వెంటనే డగ్గుత్తికతో "అమ్మా" అంటూ వెళ్ళి తల్లి మెడకు, చేతులు చుట్టవేసి గుండెల కంటుకుపోయింది అన్నపూర్ణ.

ఆనందబాష్పాలతో కూతురి శిరస్సు అభిషేకిస్తూ బరువుగా ముద్దుపెట్టుకుంది రాజేశ్వరి.

ఆప్రేమా ఆవాత్సల్యమూ చూసి నిలువునా కరిగిపోయాడు రామశాస్త్రి.

3

నడివీధిలో పే-ద్ధ బాంబు పేలిన ట్టు, ఆవార్త, క్షణంలో వూరంతా పాక్కు-పోయింది.

దాంతో, అగ్రహారాని కగ్రహారం అంతా, గట్టుతెగి పురకలు వేసుకుంటూ గోదావరివరద వూళ్ళో పడ్డంత గగ్గోలు పడిపోయింది.

ఎక్కడివా రక్కడ పురుషులు ధర్మపన్నాలు విడేశారు. స్త్రీలు, బుగ్గలు నొక్కుకున్నారు.

కొందరు మాత్రం మె — ఘిరిపోయారు.

కొందరు గోదావరిగ ట్టెక్కారు.

కొందరు ప్రాకారా లెగబాకారు.

కొందరు పుంతలో చింతచె ట్టెక్కారు.

అసత్యమూ అతిశయోక్తీ యేమీ లేదు, విన్నది విన్నట్టు జరుగుతోం దక్కడ.

బాణాకర్ర చేతబుచ్చుకుని సవ్యాపసవ్యంగా పరవళ్ళు తొక్కడం చూపిస్తున్నాడు, వీరముష్టి సుబ్బయ్య.

తాను కూడా అంత బాణాకర్రా చేతబుచ్చుకుని, మధ్య మధ్య తబ్బిబ్బు లవుతూ వుండిన్నీ దీక్షగా అడుగు వేస్తోంది అన్నపూర్ణ.

పారిజాతపు చెట్టుకింద సిమెంటుబల్లమీద కూచుని "కంగారు పడకమ్మా" అంటూ కూతుర్ని ప్రోత్సాహ పరుస్తున్నాడు రామశాస్త్రి.

పెరటిగుమ్మం పొదిగిట నుంచుని సంబరపడుతూ చూస్తోంది రాజేశ్వరి. కాని పుణ్యస్త్రీలు కొందరూ, వితంతువులు చాలామందీ బిందెలు చేతబుచ్చుకుని గోదావరిగట్టు పొడూగునా నుంచుని తమకేసే చూస్తూ వుండడమూ, వారి మధ్య అక్కడక్కడ యువకులున్నూ గుంపులుగుంపులుగా వుండడమూ, మొగం యిటు తిప్పుకోగా ప్రాకారాలు కూడా యువకుల తలలతో నిండివుండడమూ చూసి, తుళ్ళిపడి, గిరుక్కున తిరిగి లోపలికి వెళ్ళిపోయిం దామె చిరాకుపడుతూ.

"అసలు రాజేశ్వరికే పుట్టివుంటుం దమ్రా దుర్బుద్ధి" అందొక ప్రౌఢ, అది చూసి.

"తల్లికే పుట్టిం దనుకో దుర్బుద్ధి. తండ్రి కూడా ఆడారి అబ్బనన్న కనక -- అంగీకరించాడే అనుకో. అన్నపూర్ణ కయినా సిగ్గూ బిడియమూ వుండాలా వద్దా? చెట్టంత మనిషి, పైట లేకుండా అలా నుంచుంటుందా మొగాళ్ల యెదట, మనకే చచ్చినచా వయిపోతూ వుంటే?" అంటూ చీదరించుకుం దొక మధ్య.

"అదేదో కాడ వున్న జల్లెడలా వుంటుందీ? వలకి తగల కుండా అవతల పడేటట్టు బంతి కొడతారూ, దాంతోనూ? రాజమహేంద్రవరంలో చదివినంతకాలమూ మరోముగ్గురు ఆడాళ్లనూ మొగాళ్లనూ కలుపుకుని ఆడుతూనే వుండేదిట అది, సిగ్గూ బిడియమూ యెక్కణ్ణుంచి వస్తా యమ్మోయ్ మా వదినకి?" అంటూ ముక్కూ మూతీ తిప్పుకుంది మరో మధ్య.

"ఇంతకీ: - అది అన్నపూర్ణేనా?" అనడిగిం దొక ప్రౌఢ వితంతువు, కొత్తగా వచ్చిన చత్వారంతో కళ్లు చికిలించు కుంటూ చూసి.

"నడే" అంటూ ముం దామె రెక్కగూళ్ల మీద పొడి చిం దొక తరుణవితంతువు.

"ఆరత్నాలు చూశావా యెలా మెరిసిపోతున్నాయో? రాజేశ్వరమ్మగారికీ అన్నపూర్ణకీ తప్ప యీ వూళ్లో మరెవరి కున్నాయీ అలాంటి నగలూ?" అంటూ, తరవాత నిలవ తీసి అడిగిం దామె.

చెడ్డీమీద పొట్టిపావడ కట్టుకునీ, బనియనుమీద ఆకు పచ్చ పట్టుజాకట్టు తొడుక్కునీ, కబరీభారం బిగ్గా ముడుచు కునీ వుంది, అన్నపూర్ణ.

చెవుల కమలాలూ, ముక్కున బేసరీ, చేతుల బంగారు గాజులూ ఆప్రాతఃకాలపు లేత యెండలో మిలమిల్లాడి పోతున్నాయి.

"వారే, దానికి కసరత్తు చేసిన మొగుడే దొరుకుతా డంటావా?" అనడిగాడు, గోడమీదుగా తొంగిచూస్తున్న పక్కవాణ్ణి తట్టి, వొక యువకుడు.

"బి. ఏ. కావాలని కొందరూ, యేకపుత్రుడయి వుండా లని కొందరూ, అత్తగారూ ఆడబడుచులూ వుండకూడ దని కొందరూ, తండ్రిం కావని పెత్తనం చేసుకుంటున్నవాడు కావా లని కొందరూ ఏరుకునేటట్టు జెట్టినే చూసుకుని పెళ్ళాడుతుం దది, తప్పేం?" అని ముదలకించాడు దాని మీద, పక్కవాడి కవతల వున్న కృష్ణయజ్వ.

"ఇరవై యేళ్ళు నిండవచ్చి యిప్పటికే ముదిపేరక్కలా తయారయింది కదా, యీ కసరత్తుతో అది మరింత మోటు తేరిపోదూ? పా — చ్చగా దబ్బపండు లాగే వుంటుం దనుకో, నాజూకుతనం సన్నగిల్లిపోయాక దాన్నే అభాగ్యుడు పెళ్ళాడ తాడురా పోనీ?" అని కృష్ణయజ్వని మెదు రడిగాడు భోగప్ప.

"లుంగీ కట్టి వొకడూ, పొట్టికోటు తొడుక్కుని వొకడూ, ముక్కు కింద మూడు పరకల మీసా లుంచుకుని వొకడూ,

విజాతీయు ల్లాగా, విదేశీయు ల్లాగా వున్నవాళ్ళకే పెళ్ళిళ్ళయిపోతున్నాయి గదా, నీకా సందేహం యెందు కలిగిందోయ్?" అంటూ అట్నుంచి నిలవతీశాడు సీతాపతి.

"కాకపోయినా, యిరవై యేళ్ళు నిండా యని అగ్రహారంయువకు లెవరయినా ఆమె యెడల విముఖు లవుతున్నారా?" అనడిగాడు సూరిశాస్త్రి, సౌమ్యంగా.

అగ్రహారం యువకు లతణ్ణి తేరిచూశారు.

"ఆమె కోసమూ, ఆమె తండ్రి ఆస్తికోసమూ గుటకలు మింగుతూ, యీ వూరి యువకులు కొందరయినా, ఎలాంటి సంబంధాలు తమకోసం వచ్చినా తిరస్కరించేస్తున్నారా లేదా". అని కూడా అడగం డన్నాడు సూరిశాస్త్రిని సీతాపతి.

"అంతమాట నే నెందుకు లెండి అనడం?" అన్నాడు వెనక్కి తగ్గుతూ సూరిశాస్త్రి.

అది చూసి పురెక్కి "అయితే యేమిటండీ?" అన్నాడు కొంచెం దురుసుగా, మల్లీ బోగప్ప.

సూరిశాస్త్రికి ఒళ్లు మండింది; కాని నిగ్రహించుకున్నాడు ముందు.

"ఆమెని చూసయినా — ఆమెకోసం తపస్సు చేస్తున్న యువకులు, ఆమె లాగ తామున్నూ సాముగరిడీలు నేర్చుకోవచ్చుగా?" అనడిగాడు తరవాత, అలాగే సౌమ్యంగా.

దీనిమీాద గోడ విడిచి యివతలికి వచ్చి "వొరేయ్, అగ్రహారం నీళ్లు వొంటబట్టాయిరోయ్ సూరిశాస్త్రిగారికి" అన్నాడు రామచంద్రుడు, కొంచెం హేళనగా.

సూరిశాస్త్రి కొంచెం నిరసన చూపు కనబరిచి వూరుకున్నాడు ; గాని " యెందు కా హేళనా ? " అంటూ చురుమన్నాడు సీతాపతి.

" ఆయన అన్నమాటలో తప్పేముందీ ? అన్నపూర్ణ సాముగరిడీలు నేర్చుకోడం నీ కిష్టం లేకపోతే దానికి : పెళ్లే కాదంటావా, విద్యపూర్తి చేసుకుని నిన్ను ప్రార్థిస్తే తిరస్కరించేస్తానంటావా ? కాకపోయినా, నీకూ నాకూ మాత్రమే కాదు, ఈ మూడువందల గడప అగ్రహారంలోనూ ఆయన్ని హేళన చెయ్యడాని కొక్కడికీ తాహతు లేదు తెలుసా ? " అని కఠినంగా కూడా అడిగాడతను.

" ఎంచేతనోయ్ ? " అంటూ రామచంద్రుడూ " ఏమిట్రా ఆవిశేషం ? " అంటూ నరసావధానీ ముందుకి తోసుకు వచ్చారు, వెంటనే.

" గోవిందభట్టాచార్యులుగారి దొడ్లో ప్రవేశించిన ముగ్గురు దొంగలనూ చచ్చువెదురుకర్ర పుచ్చుకుని ఆయనే తరిమి కొట్టారు గాని, చూస్తూ వుండిన్నీ మీలో వొక్కడయినా దగ్గిరికి వెళ్ళగలిగారా ? "

సీతాపతి యిలా నిలవతీసి అడగ్గా " మేమంతా వెనకాల వున్నామన్న ధైర్యం వుండబట్టి గాని లేకపోతే తెలుసును ఆయన పసా నీపసాను " అన్నాడు భోగప్ప మళ్ళీ, వెనక్కి మాత్రం వెళ్ళిపోతూ.

మిడుతూ మిడుతూ చూస్తూ రామచంద్రు డంతకి ముందే మళ్ళీ గోడదగ్గిరికి వెళ్ళిపోయాడిదేమీ యెరగనట్టు.

అది చూసి అసహ్యించుకున్నాడు సీతాపతి.

ఒక్క క్షణాని గ్గాని అతను తేరుకోలేకపోయాడు.

చివరి కిటు తిరిగి "సాముగరిడీలు మీా రెందుకు నేర్చుకో గూడదూ?" అనడిగాడు సూరిశాస్త్రిని సాదరంగా.

"ఎందుకు నేర్చుకోగూడదూ అనికాదు, చిన్నప్పణ్ణుంచీ అంత మక్కువ వుంది కదా, యెందుకు నేర్చుకోలేదూ అనడగండి"

"ఇంకేమీా? మనం యిద్దరమూ కలిసి నేర్చుకుందాం"

"బాగానే వుంది; కాని యిటు వారాల భోజనం చూసుకోడానికీ, అటు భట్టాచార్యులవారిని సేవించుకుంటూ నాలుగక్షరాలు నేర్చుకోడానికీ చెల్లిపోతోంది నాకు కాలం"

"రోజు కొక్క గంటే వీలు కాదంటారా?"

మొగం పక్కకి తిప్పుకుని సాలోచనగా తల పంకించుకున్నాడు సూరిశాస్త్రి.

"ఆలోచించండి, బాగా"

"నేర్చుకోడాని క్కాదు ఆలోచన"

"మ రెందుకూ?"

ఉండుండి "నేను సాముగరిడీలు ప్రారంభిస్తే ఈ అగ్రహారంలో నాకు అన్నం దొరుకుతుందా?" అనడిగాడు సూరిశాస్త్రి నిరాశగా.

గతుక్కుమనిపోయాడు సీతాపతి.

వైదిక విద్యలకు మాత్రమే ఆదరగౌరవా లున్న వూరది. కళానిపుణులు – వైద్యులు కూడా పంక్తిబాహ్యు లన్న నిశ్చయంతో వున్నవా రావూరి పెద్దలు.

వేదశాస్త్రాలల్లుకుపోయినచోట మరో విద్యకు ఆస్కారం వుండకపోడం సంప్రదాయమేగా ?

పోనీ, అగ్రహారందారే మారిపోయా డనుకుంటే, చాటునా మాటునా ఆయన కెన్ని పంగనామాలూ ?

"నిజమే" అనుకోక తప్పింది కాదు సీతాపతికి.

కాని "యింతవరకూ మా యింటో మీ కొక వారం వుండనే వుంది. తక్కిన వారాలవా రెవ రయినా తిరస్కరిస్తే మీకు మరో మూడు వారా లిస్తాను, ముగ్గురు కొత్త విద్యార్థులు కోరుతున్నారు వాళ్ళని కాదని. కాలక్షేపం జరగదూ ?" అనడిగా డతను.

దీనిమీద "మీ రేవిద్య నేర్చుకున్నా మా యింటో వారానికి విఘాతం లే" దన్నాడు కృష్ణయజ్వ.

"చాలా సంతోషమూ, మీకు చాలా వందనాలూను. ఏతావతా :- అనుమానమే కాని ఆందోళనకారణం పుట్టకే పోవచ్చు. అయినా, మరో రెండు సందేహాలు కూడా వున్నాయండీ"

"ఏమి టవి ?"

"ఒకటి – రామశాస్త్రిగారు నా కవకాశం యిస్తారా ?"

"నే నున్నానుగా ?"

"భట్టాచార్యులవా రంగీకరిస్తారా ?"

తప్పనిసరిగా సీతాపతి ఆలోచనలో పడ్డాడు.

"పిన్నిగారు కనక మనవిచేస్తే వా రంగీకరించకపో రన్న ధైర్యం లేకపోలేను సుమండీ"

సీతాపతి అప్రయత్నంగా తల పంకించుకున్నాడు, అంతే.

ఇద్దరూ మౌనంగా బయలుదేరారు.

"రామశాస్త్రిగారిని నామాట కూడా అడగరా" అంటూ సీతాపతి వెంటపడ్డాడు కృష్ణయజ్వ.

"వాళ్ళకే యిస్తే మనకీ యిస్తారు శాస్త్రిగా రవకాశం, రారా" అంటూ భోగప్ప చెయ్యి పట్టుకు లాగాడు రామచంద్రుడు.

ఒక మళుపు తిరిగాక "నే నీ విషయం పిన్నిగారితో మనవిచేసుకునే దాకా నా సంగతి మీరు రామశాస్త్రిగారి దగ్గిర తేవద్దు" అని సీతాపతికి చెప్పి సూరిశాస్త్రి దిగడిపోయాడు.

౪

మరో మళుపు తిరిగాటప్పటికి సూటిగా అడ్డంవచ్చి "నుంచో" అంటూ గుండెలమీద చెయ్యివేసి ఆపుచేశాడు కొండుశ్రౌతి సీతాపతిని.

"అక్కడ యేమి జరుగుతోందో చూసివుంటే నువ్వు నన్నాపుచేసి వుండవు" అన్నాడు సీతాపతి, శ్రౌతి చెయ్యి తన గుండెలమీదే పట్టుకుని.

"అక్కడ జరుగుతున్నదానికి పూర్వరంగం యేమిటో తెలుసుకుని వుంటే నువ్వెందుకు నన్ను తప్పుపట్టి వుండకపోదువు" అన్నాడు శ్రౌతి, ఆప్యాయంగా తానున్నా సీతాపతి చెయ్యి పట్టుకుని.

"అయితే, నీయిష్టం వచ్చినంతసేపు నుంచుంటాను"

అంటూ వీధి మధ్యగా వున్నవా డల్లా ఒక పక్కకి ఒత్తిగి ల్లాడు సీతాపతి.

అందరూ ఒత్తిగిల్లారు, అనుకోకుండానే.

ఈసందుబాట్లో "వీళ్లతో మన కేం పనిరా? మనం ముందు వెళ్లిపోదాం శాస్త్రిగారి దగ్గిరికి" అన్నాడు, అపవారించి భోగప్పతో రామచంద్రుడు.

"తెలవిలాగే వుంది. వాళ్ళు చెప్పుకునే మాటలు మనకీ ఉపయోగిస్తాయిరా" అంటూ భోగప్ప కూడా అపవారించే రామచంద్రుణ్ణి మందలించాడు.

"ఈసాముగరిడీలకు పెద్ద కారణమే వుంది" అంటూ ప్రారంభించాడు, ఇంతలో శ్రౌతి.

"లేకపోతే యెందుకు ప్రారంభం అవుతుం దోయ్?"

"నిన్న సాయంత్రం అన్నపూర్ణ కొక సంబంధం వచ్చింది"

"ఒక టేమిటి, ఇరవయ్యో ముప్పయ్యో వచ్చివుంటే?"

పులుకూ పులుకూ చూసి "అన్నీ వొక్కమాటే వచ్చాయా?" అనడిగాడు శ్రౌతి.

సీతాపతి తెల్లపోయాడు.

"కనక, చొప్పదంటు ప్రశ్నలు కట్టిపెట్టు"

"సరే"

"పెళ్లివారితో నేనూ వెళ్లాను. పెళ్లికొడుకు ఇంటర్లో నాకు సహాధ్యాయి అయివుండినవాడు కనక"

"పోటీ కూడా యేమో?"

"నీకూ్కడా నేమో? అప్రాచ్యుడా! సూదికోసం సోదికి వెడతావూ?"

"వీళ్లకీ వుందీ ఆశా!" అన్నట్లు అపవారించి కను బొమ్మ లెగరవేసుకున్నాడు భోగప్ప.

అది వోరకంట చూసి, మొగాలు పక్కకి తిప్పుకుని ముసి ముసినవ్వులు నవ్వుకున్నారు రామచంద్రుడూ నరసావధానీని.

"సరే, ముందుకి వెళ్లు" అన్నాడు సీతాపతి.

"ను వ్వేమయినా అను. అన్నపూర్ణకి తగ్గవరుడు బ్రహ్మి గాళ్లలో పుట్టివుండలే దెక్కడా. పుట్టే వుంటే వాడు రెండో జన్మ మెత్తవలసిందే"

"అగ్రహారం అంతా చవుటిపర్రే అంటావా?"

"ఒక్క మన అగ్రహారం లెక్కేమిటి, ఆంధ్రదేశం అంతాను"

"ఎంచేత నంటావ్?"

"పాత సంప్రదాయాలు చెయ్యి జారిపోయాయి. కొత్త సంప్రదాయం రూపొందలేదు. ఈయుగసంధిలో పుట్టుకు వచ్చింది అన్నపూర్ణ. దాని జీవితానికి సాఫల్యమే అబ్బు తుందో, అడివి గాసిన వెన్నెలలాగ అది వ్యర్థమే అయి పోతుందో మరి"

"అంత విశేషం యేమిటోయ్?"

"విశేషం కాక? ఇంకిన్ని మాట లెందుకూ? నిన్నటితో నా కళ్లు విడ్డాయి. నాకు సత్యం గోచరించింది. నేను లాకాలే ప్రయత్నం విరమించుకున్నాను, దాంతో"

"విరమించుకుని?"

కెవ్వు మన్నట్టడిగాడు సీతాపతి.

"సాముగరిడీలు నేర్చుకుంటాను ముందు"

సీతాపతి వులిక్కిపడ్డాడు.

"అందుకోసమే మేము రామశాస్త్రిగారి దగ్గిరికి బయలు దేరాం" అన్నాడు రామచంద్రుడు, ఒక్క గంతులో ముందుకి వచ్చి.

అతనికేసయినా చూడకుండా? "ఏం, అలా అయిపోయావేం?" అనడిగాడు శ్రౌతి సీతాపతిని.

"పెళ్లివారి సంగతి చెప్పు ముందు"

"అన్నపూర్ణ మాతామహుడు తీసుకువచ్చాడు సంబంధం"

"ఊళ్లోవాళ్లు పనికి రారని పైనుంచి యెన్ని సంబంధాలు తెచ్చినా ఆయనేగా?"

"ఇక తీసుకురాడు. అగ్రహారంలోనే అడుగుపెట్ట డిక"

"అగ్రహారం శనీ మన శనీ కూడా విరగడ అయిపోయిందన్నమాటే"

"రామశాస్త్రిగారు పెళ్లివారికి దర్శనమే యివ్వలేదు. చెప్పుదెబ్బ కొట్టినట్టు మహా మంచిపని చేశారులే ఆయన. ఇంతకీ:- పెళ్లికొడుక్కి అలకపాన్పుమీద కావలసిందేమిటో తెలుసా?"

"నువ్వు తెలియపరిచావా?"

మంగలికత్తి స్ఫురించేట ట్టభినయించాడు శ్రౌతి.

"అంటే?"

"మంచిరకం షేవింగుసెట్టోయ్"

"ఛీ, ఛీ" అంటూ చుట్టుకుపోయాడు సీతాపతి.

అందరున్నూ చీదరించుకున్నారు, రకరకాలుగా.

చూసిచూసి "బందిపోటు దొంగలు నయం వాళ్ళకంటే" అంటూ మళ్ళీ అందుకున్నాడు శ్రౌతి.

"పెళ్ళికొడుకు తండ్రి, పెళ్ళికొడుకు మేనమామ, పెళ్ళికొడుకు చెల్లెలి మొగుడు, చివరికి పెళ్ళికొడుకు — నలుగురూ నాలుగు షరతుల జాపితాలు చదివారు. ఒక్కడాల్లోనూ సంసారిలక్షణం కనపడలేదు. ఒక్కడికీ మనం మెత్తింది బ్రాహ్మణజన్మ అన్న జ్ఞానం లేదు"

"బ్రాహ్మడైనవాడు బ్రాహ్మణజన్మ మరిచిపోతే యిక వాడి ప్రవృత్తిలో తాండవించేది కసాయితనమేగా?"

"నామట్టుకి నాకు — తక్కినవాళ్ల మాట యేమయినా, కనీసం, పెళ్ళికొడుకు నయినా సాచికొడదాం అన్నంత కోపం వచ్చింది; కాని అంతపనీ అన్నపూర్ణ చేసేసింది లే"

"ఏమిటీ?" అంటూ కెవ్వు మన్నా రందరూ.

శ్రౌతి జరిగిం దంతా ఆచి ఆచి చెప్పాడు.

"ఓః! ఓః!" అంటూ గిరగిర తిరిగిపోయాడు సీతాపతి.

లోపల్లోపల "బాబోయ్" అనుకుంటూ కొంచెం వెనక్కి తగ్గాడు, రామచంద్రుడు.

భోగప్ప కొయ్యయిపోయాడు.

"మన అగ్రహారం పరువు నిలవబెట్టింది అన్నపూర్ణ. నిజంగా, అది, చరిత్రలో స్వర్ణాక్షరాలతో రాయవలసిన సన్నివేశం. అయితే, దానికి పెళ్ళికొడు కేమి బదులు చెప్పాడూ?" అనడిగాడు కృష్ణయజ్వ, అందరితోనూ పాటుగా మొదట తానూ వొక్కమాటు చకితుడై.

కాని యెవరూ అదివినిపించుకోలేదు.

అప్పటికి ప్రకృతిలో పడి "వోరేయ్! అన్నపూర్ణ మనకి తక్కుతుందనుకోను" – అంటూ సీతాపతి మాట సగంలో వుండగా అందుకుని "నన్ను కలపకు" అన్నాడు శ్రౌతి, గుండెలమీద తర్జనితో టోకాయించుకుంటూ.

"పోనీ, కలపను; కాని అన్నపూర్ణని పెళ్ళాడగలిగితేనే ధన్యత"

"అది కాదు మాట. ధన్యుడైనవాడికే అది తక్కుకుంది"

శ్రౌతి యిలా వొత్తి చెప్పగా, రామచంద్రుడు, ఏకుపు మొగం పెట్టుకని పక్కకి తిరిగాడు.

తనకీ అన్నపూర్ణకీ మధ్య వుండిన భూభాగం యింకా యింకా విశాలం అయిపోతోంది దని కంగారుపడుతూనే "అది సరే కాని, అన్నపూర్ణ కేమి బదులుచెప్పాడూ పెళ్ళికొడుకు?" అని మళ్ళీ అడిగాడు కృష్ణయజ్వ.

"వాడి మొఘం – అన్నపూర్ణ తప్ప మరెవరూ లేని – సాలీనా పదివేల ఆదాయం వచ్చే – లక్షాధికారిని అప్రాచ్యపుకోరికలు కోరినవాడు అన్నపూర్ణ కేమి చెప్పగలడూ? వాడి కసలు నోరు స్వాధీనం అయితేనా?"

భోగప్పా రామచంద్రుడూ బికూ్కబికూ్క చూసుకున్నారు.

"విన్నావా?" అంటూ మళ్ళీ అందుకున్నాడు శ్రౌతి.

"ఎన్నడూ చూడనిదీ, విని అయినా వుండనిదిన్నీ, పైగా అనుకోనిది కూడానూ, దానా దీనా నాకూ అప్పుడు మాట

తోచలేదు; కాని ఆమాటతో నే నింతవరకూ యెరిగివుండని అంతరాంతరాల్లోకి వెళ్ళిపోయాను. రుక్మిణీకల్యాణం, సుభద్రాహరణం, ద్రౌపదీస్వయంవరం, సత్యాపరిణయం, శివధనుర్భంగం — ఇలాంటి ఉదంతాలు నా కళ్ళముందు తిరిగిపోయాయి. అప్పుడు అన్నపూర్ణ మొగాన భాసించిన శౌర్య తేజస్సులో నాకు రుద్రమ్మా, నాగమ్మా, రాగమ్మా, సాక్షాత్కరించారు."

ఈమాట చెప్పేటప్పుడు శ్రోతికీ, వినేటప్పుడు సీతాపతికీ శరీరాలు గరిపొడిచాయి.

"అబ్బురమా?" అంటూ అందుకున్నాడు సీతాపతి.

"అన్నపూర్ణ స్కూలుఫైనలు యోగ్యత ముందు నీ ఆనర్సూ, నా బియ్యేస్సీ కూడా యెందుకూ కొరగా వనే మనం అంగీకరించాలి. ఇంగ్లీషుభాషని మనలో మనం సంభాషణకే వినియోగించుకుంటున్నాం; గాని —"

"అన్నపూర్ణ తెనుగువాళ్లతో యింగ్లీషులో మాట్లాడదు తెలుసా?"

"ఇంగ్లీషు అంటకపోడమే అందు క్కారణం అనుకుంటూ వచ్చాను నేను. శాస్త్రిగారొకమాట" మా అమ్మాయి చదివిన యింగ్లీషుపుస్తకాల పేర్లయినా వినివుండరు మీ" రన్నారు "ఎంత బడాయిరా" అనుకున్నాను; కాని యిప్పుడర్థం అవుతోంది"

"ఏమనీ?"

"మనం ఆభాషను మాత్రమే స్వాధీనపరుచుకున్నాం. అన్నపూర్ణ ఆవాఙ్మయం జీర్ణం చేసుకుంది"

"అదీ అన్నపూర్ణకీ మనకీ వున్న తేడా. దాని భావాలు మారడానికీ, అదొక నిశ్చయానికి రావడానికీ, ఒక పథకం వేసుకుని అవి సాహసించి ఆచరణలో పెట్టడానికీ కారణం అదీ"

"అందుకు నే నంగీకరించను" అంటూ దురుసుగా ముందుకి వచ్చేశాడు రామచంద్రుడు.

అందరూ చూసి వూరుకున్నారు.

దాంతో రామచంద్రుని పొంగు చల్లారింది. అయినా వుండలేక "ఇంగ్లీషు నేర్చుకోకపోతే మన కుద్యోగాలు దొరకవు. కనక, మనం, ఆభాష అన్వయపద్ధతీ, ప్రయోగ సరణీ—ఇవి మాత్రమే సాధించుకోవాలి. ఆభావాలు జీర్ణం చేసుకున్నామంటే మాత్రం మన జాతీయత దెబ్బతింటుంది" అన్నాడు, చురుగ్గా చూస్తూ.

దీనిమీద "తీసెయ్ నీజాతీయత" అంటూ అంతకంటే ఆవేశంతో యెదురుకున్నాడు సీతాపతి.

"మన కున్నది వర్ణవ్యవస్థ కాని జాతీయత కాదు. ఆది కాలంలో మన దేశం విజాతీయుల పాల బడడాని క్కారణం అదీ. ఈవర్ణవ్యవస్థకి తోడు అప్పటి మనవాళ్ళకి 'నారాజు' అనే కాని 'నాదేశం' అనే భావం లేకపోయింది. ఇంగ్లీషు ప్రభుత్వం వచ్చాకే మన కీభావం పుట్టింది. బలాపడింది"

"ఇంగ్లీషు ప్రభుత్వంలో మన జీవనసరణి మారిపోయింది. మన విశ్వాసాలు కదిలిపోయాయి" అన్నాడు రామచంద్రుడు, గుక్క తిప్పుకోకుండా.

"కనకనే మనం మళ్ళీ వెలుగు చూడగలిగాం"

"అవు" నన్నాడు సీతాపతి.

"ఇందులో వున్న విశేషం గుర్తించావా?" అని సీతాపతి నడుగుతూ అందుకున్నాడు శ్రౌతి.

"తనికి తెలియకుండానే ఇంగ్లీషుప్రభుత్వం మనకు చేసిన ఉపకారం యిది. అటు 'నా రాజు' అనే భావమూ, ఇటు 'నా విష్ణుః పృథివీపతిః' అన్న నమ్మకమూ ముదిరిన కాలంలో ఊరూరా రాజులు వెలిశారు. దీంతో మనం విభేదమే గాని ఐక్యం అన్నమాట మరిచిపోయాం. అది పోయి 'నా దేశం' అన్న భావం కొత్తగా అనుభూతం అయి, ఎడ మొగం పెడమొగంగా వున్నవాళ్ళ నందరినీ వొక తాటి మీదికి తెచ్చింది. యుగయుగాలుగా బానిసతనంతో మగ్గిపోతూ వెలుగుమొగం ఎరక్కుండా వుండిన అస్పృశ్యుడూ, పాలకజాతివాణ్ణి అనుకునే క్షత్రధర్మావలంబీ, బ్రహ్మమొగం నుంచి వూడిపడ్డా ననుకునే బ్రాహ్మడూ భుజమూ భుజమూ రాసుకుంటూ స్వాతంత్ర్యసమరం సాగించడానికీ కొత్త భావమే కారణం. నా దేశం అనుకోగలవాళ్ళకి వర్ణవ్యవస్థ నచ్చదు. వాళ్ళకి నచ్చేదీ, నిజంగా కావలసిందీ జాతీయత. ఈభావమే మనకి నూత్నజవసత్వాలు కలిగించింది. ఇది నేర్చుకోవడంవల్లనే మనం తరతమభేదా లెరగని విదేశీయులను ఎదిరించగలిగాం"

"జాతీయత పూర్తిగా బలపడని స్థితిలోనే యింతపని చెయ్యగలిగా మంటే –"

సీతాపతి మాట కడ్డంవచ్చి "ఉన్న కిటుకల్లా అదే" అని తర్జనితో టొకాయిస్తూ అందుకున్నాడు శ్రౌతి.

"మన కిప్పుడు చేజిక్కివున్న స్వాతంత్ర్యం నిలవా లన్నా, నిలిచి జగజ్జేగీయమానం కావా లన్నా, ఇక మనం కొత్త ధర్మం నిర్ణయించుకోవాలి. కొత్తరక్తం పెట్టించుకోవాలి. కొత్తజాతిగా స్ఫుటంగా రూపుదిద్దుకోవాలి"

"అన్నావు కదా! మనకంటే ముందు అన్నపూర్ణే. యీ సత్యం గుర్తించిం దనడానికి నీ కేమయినా అభ్యంతరం వుందా?"

"నా కభ్యంతరం యేమిటోయ్ హృదయం ముందుకు పోతూ వుంటేనూ? కాసె బిగించి వొక ఆడపిల్ల కసరత్తు చేస్తూ వుంటే, మనం గర్భవతులకోసం పుట్టిన బాడ్మింటన్‌తో కాలం గడుపుతూ కూచోమా?"

"ఛీ, ఈక్షణంతో నేను బాడ్మింటన్ బహిష్కరించే స్తున్నా" నన్నాడు రామచంద్రుడు, దులపరించుకుంటూ.

"మరి పదండి" అన్నాడు కృష్ణయజ్వ, శ్రౌతినీ సీతా పతినీ, జబ్బలుపట్టుకుని ముందుకి తోస్తూ.

"మాకున్నూ అవకాశం యిమ్మని శాస్త్రిగారి నడగడా నికే బయలుదేరాం" అన్నాడు సీతాపతి, జబ్బ విడిపించు కుంటూ.

"వా రంగీకరించకపోతే?"

"వా రంగీకరించకపోతే—" అంటూ మాట నాన్చే శాడు సీతాపతి. కృష్ణయజ్వ సీతాపతికేసి చూశాడు.

"ఛా, ఇంతా చేసి చివరి కిదా నీ ధోరణి? వా రంగీక రించకపోతే మన మంతా కలిసి మరో వీరముష్టిని తెచ్చు

కుందాం పదవోయ్" అంటూ ముందు కడుగు వేశా సీతాపతి.

"అవు" నంటే "అవు" నంటూ భోగప్పా నరసావధానీ శ్రౌతి ముందుకి వెళ్లి నుంచున్నారు, వీరాధివీరుల మొగం పెట్టుకుని.

౨౪

ఒక్క పావుగంట మాత్రమే అడుగు వేయించి "ఆరంభ శూరత్వం మంచిది కాదండి" అన్నాడు సుబ్బయ్య.

"అవు" నంటూ లేచినుంచున్నాడు శాస్త్రి "ఇంకెందుకూ ?" అన్నట్టు కూతురికేసి చూస్తూ.

వెంటనే బాణాకర్ర అక్కడ పడేసి చరాచరా యింటోకి చక్కాపోయింది అన్నపూర్ణ.

గోదావరిగట్టుపొడూగునా అయిదుయకరాల నివేశనంఅది. దాల్లో, వుత్తరాన సరికొత్త మండువాలోగిలి.

నివేశనాని కొకటీ, యింటి కొకటీ ప్రాకారాలు.

ఇంటి వెనక వున్న గాదుల మధ్యగా సాముగరిడీలు.

ముందు రామశాస్త్రీ, చెడ్డీమీద పంచె చుట్టబెట్టుకుని తరవాత సుబ్బయ్యా, గోదావరిగ ట్టెక్కి ప్రాకారా లెగబాకీ చూస్తున్న స్త్రీపురుషుల అసభ్యప్రవర్తన విమర్శించుకుంటూ యిల్లు తిరగవేసుకుని అక్కడికి వచ్చాటప్పటికి, యెదురుచూస్తూ పదిమంది యువకులు పందిట్లో నుంచుని వున్నారు.

అందరూ శాస్త్రికి నమస్కరించారు.

"ఏం, మీ రంతా యిలా వచ్చారు, కూచోండి" అన్నాడు శాస్త్రి, తానొక కవాచీబల్లమీద కూచుంటూ.

సీతాపతి యింగితం కనిపెట్టి "చిత్తం" అంటూ శ్రౌతి ముందుకి బయలుదేరాడు; కాని "మనవి చేసుకుంటాను" అంటూ రామచంద్రు డతని కడ్డంగా వచ్చి నుంచున్నాడు.

"నువ్వు కాదు, వెనక్కి రారా" అన్నాడు కృష్ణయజ్వ.

"తప్పుకో" అన్నట్టు తర్జనితో టొకాయించాడు శాస్త్రి.

అప్పుడు వెళ్ళా డవతలికి రామచంద్రుడు కృష్ణయజ్వకేసి తీక్ష్ణంగా చూస్తూ.

శ్రౌతి సావధాను డయినాడు.

"నిన్న సాయంత్రం ఆదొరగార్లతో నువ్వా వచ్చావు, చూశా" నన్నాడు రామశాస్త్రి.

"చిత్తం చిత్తం, ఆకుర్రవాడు వాల్తేరులో నాకు సహాధ్యాయి. ఆమెరికని పట్టి మా యింటికే వచ్చారండి వారు"

"ఉన్నారా?"

"వెళ్ళిపోయారండి. షేకింగు సెట్టుమాట మా అగ్రహారం కుర్రవాళ్ళకి తెలిస్తే వెంటబడతా రన్నాను, దాంతో, మె – ఘిరిపోయారు"

"వాళ్ళు బ్రాహ్మ లనడాని కేమయినా ఆస్కారం వుందిటోయ్?"

"లేదండి. అయితే, వాళ్ళతో వచ్చినందు కొక విధంగా నేను సిగ్గుపడ్డాను. మరో విధంగా ఇప్పటికీ ఆనందిస్తున్నానండి"

"ఆనందం యెందుకూ?"

"మీ అమ్మాయి, పెళ్ళికొడుకుని చెప్పుదెబ్బ కొట్టి నందు కండి"

"అదా?" అంటూ నవ్వేశాడు శాస్త్రి కులాసాగా

"మీకు మా ధన్యవాదాలు. మీ అమ్మాయికి మా ప్రశంసలు –"

"వింతగా వుంది నీ ధోరణి. మన అగ్రహారీకులు ప్రథమం లోనే నన్ను మంచిగా అర్థంచేసుకుంటా రని –"

"చేసుకోనివాళ్ళూ వున్నారండి"

"ఉండరూ? అగ్రహారం అంటే గడ్డకట్టిన చాదస్తం కదూ? ఏదయినా విద్యలో ప్రజ్ఞ కలవాళ్ళు ఏమన్నా అదో అందం; కాని పప్పుభొట్లు పండితులు ధర్మశాస్త్రాలు విడగొడితే యెలాగా భరించడం? ఇంతకీ :– అగ్రహారం అంతటిలోనూ ఆడపిల్లని ఇంగ్లీషు చదువులో ప్రవేశపెట్టిన మొదటివాణ్ణి నేను. రజస్వల అయితేగాని పెళ్ళిచెయ్య నని అట్టేపెట్టేసిన మొదటివాణ్ణి కూడా నేనే"

"మరి ఆడపిల్లకి సాముగరిడీలు నేర్పించడంలో మాత్రం –"

"నమ్మింది ఆచరించికపోతే మన చదు వెందుకోయ్? వేదార్థం చెప్పి, పెద్దాపురం మహారాజుని మెప్పించి, మా ముత్తాత తండ్రి సంపాదించిన అగ్రహారం యిది. ఆయన పెట్టిన భిక్షే నేనిప్పు డనుభవిస్తున్నది; కాని ఆయన నడిచిన దారి నాకు నచ్చలేదు"

"పూర్వాచారాలు నచ్చనివారు మన అగ్రహారంలో చాలా మందే వున్నారు; కాని కొత్త ధర్మం నిరూపించి అవలంబిస్తున్నవారు మాత్రం మీరొక్కరేనండి"

"ఇంగ్లీషు ఉద్గ్రంథాలనేకాలు చదవడంవల్లా, ఖండాంతర ప్రఖ్యాతపత్రిక లెప్పుడూ చూస్తూ వుండడంవల్లా మా అమ్మాయికి కొత్త దృక్పథం యేర్పడింది. ఖండాంతర ఫిలిములు దాన్ని పోషించాయి. ఇప్పుడు మన దేశంలో యింకా విజృంభిస్తూనే వున్న కల్లోలాలతో అది స్థిరపడి పోయింది. ఇవాళ మా అమ్మాయి నిర్వచించే వరయోగ్యత యేమిటో తెలుసా?"

"సెలవివ్వించండి"

శాస్త్రి రాత్రి సంగతి చెప్పాడు.

"సెబాస్" అన్నాడు శ్రౌతి.

తక్కిన యువకులు చకితులై మొగమొగాలు చూసుకున్నారు.

చూసి చూసి "స్త్రీల విలువ మన కేమి తెలుసునూ? అయినా, స్త్రీలను కాదని మనవాళ్ళలో యెవరు స్వతంత్రించ గలుగుతున్నారూ?" అనడిగాడు శాస్త్రి.

శ్రౌతి మిడుతూ మిడుతూ చూశాడు.

"వయసు వచ్చిన – విద్యావతి అయిన వొక పిల్లని శాశ్వతసహధర్మచారిణిగా ఆకర్షించుకోవా లంటే యువకు డెంత ప్రయోజకత్వం కనబరుచుకోవాలో, ఆపిల్ల కూడా భర్త నలాగ సంపాదించుకోవలసిం డే కనక, ఎంత జాగ్రత్తగా

తన ప్రవర్తన సరిదిద్దుకుంటుందో, వా రిద్దరూ వొకరి స్వత్వా లొకరెంత చక్కగా అర్థంచేసుకుంటారో, వొకరి నొకరెంత విలవగా చూసుకుంటారో –"

"చిత్తం ఆలోచించవలసిందేనండి"

"అప్పుడు మన యువకు లిప్పటి లాగ సోమరులుగా వుండడానికి వీ లవుతుందా ?"

"ఇప్పుడు నాకు బాగా అర్థం అవుతోంది. అలాంటి ఆచారం మనలో ప్రారంభం అయితే, మన యువకులలో అణగారిపోయి వున్న రకరకాల శక్తులు ఉద్బుద్ధా లవుతాయి. దేశపరిస్థితులే మారిపోతాయండి"

"ఈవరకట్నాలూ, యీ లాంఛనాలూ, యీ దూబరా ర్చులూ –"

"నిమిషంలో అంతరించి పోతాయండి"

యువకులు చకితులయి చూసుకున్నారు.

"నిన్నటిదాకా యింగ్లీషువాళ్లు మనల్ని బానిసలుగా ాశారు. మరి యివాళ ?"

"విధిలేక సాటి రాజ్యం పౌరులుగా గుర్తిస్తున్నారండి"

"భార్యాభర్తలమధ్య కూడా మన సంఘంలో అలాంటి ాపు కలగవద్దూ ?"

"కలగాలండి"

తక్కినవారిని చూసి "మీ కర్థం అయిందా ?" అనడిగాడు స్త్రి.

"అయిందండి"

"నచ్చిందా?"

రామచంద్రుడు తక్కినవారికేసి చూశాడు. వారందరూ మాత్రం నచ్చిం దన్నారు.

"మీ ధోరణి చూడగా, మూఢాచారాలతో నిండివుండిన మన అగ్రహారంలో, శాస్త్రీయదృక్పథం యేర్పరచడం యేమంత కష్టం గాదని తోస్తోంది."

"మీరు మమ్మల్ని నడపండి"

"మీరు నన్ను బాగా అర్థంచేసుకున్నా రా?"

"చేసుకున్నా మండి"

"బ్రాహ్మణక్షత్రియ వైశ్యశూద్రులకూ మాలమాదిగలకూ జన్మలో నేను భేదభావం చూపించను"

"చూపించకూడదండి"

"ఇవ్వాళ ప్రారంభించిన సాముగరిడీలలో ప్రవేశమూ ప్రావీణ్యమూ కలిగితే, ఆరుచి మూలంగా మా అమ్మాయి కూడా యీభేదభావం పాటించకపోవచ్చు"

"ఉచితంగానే వుంటుం దండి"

"ఆమె వివాహం మానుకున్నా మానుకోవచ్చు"

"బోధపడిందండి"

"నవీనదృక్పథానికి అది పరమావధి కదా?" అన్నాడు మెప్పుగా శ్రౌతి.

"నాదృష్టిలో, దాని దృక్పథం చాలా గొప్పగా వుంది. ఏమయినా దాని అభీష్టం కాదనను. అసలు, మా అమ్మాయి వెళ్ళిన మెత్తుకి నేను వెళ్ళగలనా అని నాకనుమానమే. ఇందు

కొక్క ఉదాహరణ చెబుతాను, దాని భావయంత్రం యెలా పనిచేస్తోందో మీరు గుర్తించవచ్చు. "నన్ను పెళ్లాడినందుకు, ఒక మొగాడికి, వరకట్నం పేరుగా నే నపరాధం యెందుకు చెల్లించుకోవాలి నాన్నారూ?" అనడిగింది మా అమ్మాయి, దీని కేం చెబుతారు మీరు?"

ఇలా అడిగి, శాస్త్రి, నిలవతీస్తున్నట్టు చూడగా యువకులు మొగమొగాలు చూసుకున్నారు.

చాలా మథనపడ్డారు కూడా.

ఆజాప్యం సహించలేక "మీ రే మంటా" రనడుగుతూ, చట్టున షర్టు బొత్తాములు విప్పి, యజ్ఞోపవీతం పైకి తీసి పట్టుకుని "గాయత్రీసాక్షిగా నేను ప్రమాణం చేస్తున్నాను. ఈక్షణంతో నేను వరకట్నం ఆశ వదులుకుంటూన్నాను" అన్నాడు శ్రౌతి, ఆవేశంతో.

దాంతో, తక్కినవారున్నూ వెంటవెంటనే కొందరూ, కొంచెం కొంచెం ఆలోచించుకుని కొందరూ అలాగే ప్రమాణాలు చేశారు.

రామచంద్రుడు మాత్రం తనకి వెనక వుండినవాళ్లు ముందు ముందుకి వచ్చి ప్రమాణం చేస్తున్న సందుబాట్లో అందరికీ వెనక్కి తప్పుకుని బుర్రవంచుకు నుంచున్నాడు.

అది గుర్తించాడు శ్రౌతి.

"చూశావా?" అన్నట్టు చిరునవ్వు నవ్వి, శాస్త్రి "చాలా సంతోషం!" అంటూ మళ్లీ అందుకున్నాడు, ఉబ్బెత్తుగా లేచినుంచుని.

"మీ విధే మీరు నిర్వర్తించుకుంటున్నా అది మా అమ్మాయికి ఆదరగౌరవాలుగా పర్యవసిస్తోంది. ఇప్పుడే తొక్కిన యీదారి మీరు తప్పకుండా వుంటే, మనం ర్తించుకోవలసిన విధు లింకా చాలా వున్నాయి. ఇప్పుడు మనం చూసుకోవలసింది మన వేదశాస్త్రాలేమి చెబుతున్నాయని కాదు, మన జాతి జీవితంలో యిప్పుడు సరికొత్త యుగం ప్రారంభం అయింది. మన జాతీయత యుగయుగాలపాటు దేదీప్యమానంగా విరాజిల్లా లంటే ఇప్పుడే గట్టిపునాదులు పడాలి. ఇందుకు కటిబద్ధు లయినవారికి ప్రథమంలో యెదురు దెబ్బలు కొన్ని తగలవచ్చు. అయినా జంకకూడదు"

"జంకం"

"ఇంకొక్క రహస్యం కూడా వుంది. ఇప్పుడు బాధ్యత అంతా కన్యలమీద వుంది, మగనాళ్లమీద కాదు. బ్రహ్మచారులమీద వుంది, గృహస్థులమీద కాదు. మరేమీ పని లేనట్టు మన యువయువతుల దృష్టి మొదట్లోనే పెళ్లిమీదికి పోతుంది, మన మది సరిదిద్దాలి."

"చిత్తం"

"మీరే కొత్త ధర్మానికి అవలంబం. కొత్త జాతీయతకు అంకురార్పణ చెయ్యవలసింది మీరే"

"చిత్తం, మేము మీ ఆజ్ఞ నెరవేరుస్తాము. మరి మా మనవి —"

"ఏమిటి ?"

"మేమున్నా సాముగరిడీలు నేర్చుకుంటాం. మీపాత

శాలలో మా కవకాశం వుందా, మేము మరొకటి యేర్ప రుచుకోవాలా ?"

"ఎందుకూ ? మిమ్మ ల్నందరినీ వీరాధివీరులను చెయ్య డానికే నే నిది ప్రారంభించాను, ఒక్క మా అమ్మాయి కోసమే కాదు. అయితే, మీతోపాటు మీ స్త్రీలను తీసుకు రాగలరా ?"

అవ్యవధానంగా "మా చెల్లెల్ని తీసుకువస్తా" నన్నాడు శ్రౌతి.

"నేను మా మేనకోడల్ని తీసుకువస్తా" నన్నాడు సీతాపతి.

"నేను మా పెద్దన్నయ్య కూతుర్ని తీసుకువస్తా" నన్నాడు కృష్ణయజ్వ.

అయిదు నిమిషాలు చూసినా తక్కినవారు కిమ్మనలేదు.

వాళ్లని చూసి "మీవాళ్లని తీసుకురాకపోయినా మీరు నిరభ్యంతరంగా రావచ్చు. పురుషులే కాదు, స్త్రీలున్నూ బలపరాక్రమాలు సంపాదించుకుంటేనే మనకి విజయం. మా అమ్మాయిని చూసి పురుషులే సిద్ధపడుతున్నప్పుడు, యువతులు వెనకపడతా రని నా కపనమ్మకం లేదు" అన్నాడు శాస్త్రి.

అయినా, వా రలాగే వుండిపోయారు.

శాస్త్రి అందుకున్నాడు.

"వ్యక్తిపర మైన దౌర్బల్యం యేస్థితిలోనూ బయట పడుతూనే వుంటుంది. కనక, స్త్రీపురుషులు కలిసి విద్యనేర్చి స్తే వచ్చే కొత్త అపాయం యేమీ లేదు. పురుషులంటే స్త్రీలకు

వెరుసుభావం పోవాలంటే యీపద్ధతి అవలంబించక తప్పదు స్త్రీ లిక అన్నం వండిపెట్టడం వొక్కటే కాదు, జాతిలో కొత్తచిత్తవృత్తి ప్రవేశపెట్టాలి"

"చిత్తం"

"ఇక తరవాయి. వీరముష్టియోధుల్లో యీ సుబ్బయ్యగారద్వితీయులు. వీరికి నే నిచ్చేది తక్కువ కాదు, డిప్యూటీ తహసీలుదారు జీతం. అయినా, మొదటి సంవత్సరం నెలకయిదేసి రూపాయీ లిచ్చుకోవాలి మీరు. ఆడపిల్ల" మాత్రం యివ్వనక్కరలేదు"

"మేమున్నూ యిచ్చుకుంటా" మన్నారు యువకులు. కొందరు పర్సులే పైకి తీశారు.

౬

"భట్టాచార్యులవారు దయచేస్తున్నా" రంటూ లేచినుంచున్నాడు శ్రౌతి, సవినయంగా.

కంగారుపడుతూ తక్కిన యువకులూ లేచారు.

అటు తిరిగి కూచుని వుండిన రామశాస్త్రి "యేమి టేమి లు" టంటూ విరగబడి యిటు చూసి "దయచెయ్యండి" అని స్వాగతం నివేదించుకుంటూనే లేచి అభిముఖు డైనాడు.

"శాస్త్రీ" అని పిలుస్తూ అప్పటి కక్కడికే వచ్చేశాడు భట్టాచార్యుడు, అందరి నమస్కారాలూ అందుకుంటూ అటున్నూ చూశాడు.

యోధవేషంతో, ప్రత్యాలీఢపాదంగా కూచుంటూలేస్తూ మిక్కిలీ ఆవేశంతో బాణా తిప్పుతోంది అన్నపూర్ణ.

నుదుట స్ఫుటంగా విభూతిరేఖలూ, కనుబొమ్మల మధ్య త్రిభుజంగా కుంకుమబొట్టూ, కళ్ళల్లో రక్తజీరలూ, బుగ్గ మీసాలూ, చేతిలో నిలువుడెత్తు బాణాకర్రా — వీటితో వీరభద్రావతారం లాగ మెరిసిపోతూ, అన్నపూర్ణకేసి గంభీరంగా చూస్తూ "హుషార్ హుషార్" అని మేఘ గంభీరంగా ఆమెని హెచ్చరిస్తూ ఎదురుగా నుంచుని వున్నాడు సుబ్బయ్య.

అదీ యిదీ చూసి భట్టాచార్యుడు చకితుడయిపోయాడు.

అందుకు రామశాస్త్రి మొగాన గర్వరేఖ మెరిసింది.

అరగడియసేపు ఎవరూ మాట్లాడలేదు.

కదలాలేదు.

అప్పటికి బాణాకర్ర కొసతో నేలమీద పొడుస్తూ ముందుకి నాలుగంగలు వేసి ఆవరస ముగించింది అన్నపూర్ణ.

"భట్టాచార్యులవారు దయచేశా రమ్మా" అన్నాడు అవ్యవధానంగా రామశాస్త్రి.

ఆయాసంవల్ల మాట్లాడలేక, వెంటనే భట్టాచార్యుని కెదురుగా వంగి, నేల అంటి, కళ్ళ కద్దుకుంది అన్నపూర్ణ.

"నీ కూతుర్నేమని దీవించాలో నాకు తోచడం లేదు శాస్త్రీ" అన్నాడు ఆనందతాదాత్మ్యంతో భట్టాచార్యుడు.

"తమ రలా సెలవిప్పించడం ధర్మమా?"

"ఎందుక్కాదూ? ఐశ్వర్యవతి — విద్యావతి — సౌందర్య వతి — ఏమి లోటోయ్ నీ కూతురికీ?"

"కుటుంబంలో దాని కొక విశిష్టపదవి దఖలుపడవలసే వుంది కదా?"

"అది తెలుసు. శాంబరీభిల్లుణ్ణి అనుసరించడానికి సిద్ధంగా వున్న పర్వతరాజపుత్రిక లా వుంది నీ కూతురు. తగిన వరుణ్ణి తేగలదా నా ఆశీర్వచనం?"

"తమ వాక్శుద్ధి అలాంటి దనే కదా నా ఆశ?"

"అమ్మాయీ" అని సంబోధిస్తూ అనపూర్ణ దగ్గిరికి బయలుదేరా డప్పుడు భట్టాచార్యుడు.

శాస్త్రి అనుసరించాడు, పక్కగా.

చేతులు జోడించుకుని నమ్రురాలయింది అన్నపూర్ణ.

ఆమె శిరస్సున వరదహస్తం వుంచి "అమ్మా, నీ మాతా మహుడు ఒప్పుకోడు గాని నీ జాతకం బహు విలక్షణం అయింది. ఇవాళ నువ్వు సాధిస్తూ వున్న విద్య అందు కను గుణంగానే వుంది. ఈవిద్యలోనువ్వు మిక్కిలీ ప్రావీణ్యం సంపా దిస్తావు, సందేహం లేదు. నీ ప్రావీణ్యం చూసి దేవతలు నీకు తగిన వరుణ్ణే అనుగ్రహిస్తారు, మీ నాయనకు బెంగ అక్క ర్లేదు. అయితే, మీ నాయన యెందు కిది సంకల్పించాడో నువ్వు దీక్షగా మాత్రం సాధన చెయ్యి" అన్నాడు భట్టా చార్యుడు, వాత్సల్యం గుమ్మరిస్తూ.

"సంకల్పమూ ప్రయత్నమూ మా అమ్మాయివే నండి. ఏర్పాటు మాత్రమే నాది"

"అలాగటయ్యా? ఇది మరీ వింతవిషయం. అయితే, ఆడపిల్ల కసరత్తు నేర్చుకోడం మన అగ్రహారీకుల దృష్టిలో యెంత హీనమో, మన స్త్రీ లిప్పు డంత హీనస్థితిలోనే వున్నారు."

"దేశస్థితి తమకి తెలియనిదా మరి?"

"ఎక్కడో బలాత్కృత లయిపోతున్న మన ఆంధ్ర స్త్రీలకు ఇక్కడి అన్నపూర్ణ రక్షణ అందకపోవచ్చు; కాని మన స్త్రీల కందరికీ యీ విద్య పురుషులకంటే యెక్కువ అగత్యం. వివాహం కంటేనూ అగత్యం"

"బహువేత్తలూ, బహుద్రష్టలూ తమ రిలా సెలవిప్పిస్తున్నారు కనక, అగ్రహారం అంతా తిరగబడ్డా నేనికజంకను"

"వెర్రివాడా! ఈయువకులను తప్పించి వేరే అగ్రహారీకు లెవరోయ్? ఇంతమంది బాలికలు కూడా నీ సిద్ధాంతం ఆచరణలో పెడుతున్నా రిక నీ కెదు రెవరోయ్?"

యువకు లుత్సాహాభరితు లయినారు.

బాలికలూ, యువతులూ యెగిసిపడి చూసుకున్నారు.

జయధ్వానా లంతకి ముందే మిన్నుముట్టాయి.

"కాకపోయినా, వారికి జంకి నువ్వేపని మానుకున్నావూ? నీ దూరదృష్టి అందుకోగలవా రెవ రున్నారోయ్ మన అగ్రహారం పంశితుల్లోనూ?"

శాస్త్రి నమ్రుడైనాడు.

ఇదంతా వినీ, చూసీ, చమత్కృతుడై మోదప్రకేలితో చక్కావచ్చా డక్కడికి సుబ్బయ్య.

"రండి సుబ్బయ్యగారూ! వీరు మా కందరికీ గురువులు. తర్కశాస్త్రంలో, కాశీలోనూ దారి పొడూగునా వున్న పండితుల నందరినీ "దాసోహ" మ్మనిపించుకుంటూ దయచేసిన జగత్పండితులున్నూ" అని పరిచయం చేశాడు శాస్త్రి అంజలిబంధంతో భట్టాచార్యుణ్ణి నిర్దేశిస్తూ.

వెంటనే భట్టాచార్యుని పాదాలమీద వాలాడు సుబ్బయ్య.

"విజయీభవ! శాస్త్రీ! రూపం యెంత ప్రచండమో హృదయం అంత ప్రసన్నమైన జెట్టి ఈయన. అయ్యా! ఈశ్వరకటాక్షంతో ఒక విద్యలో మీరు పారం చూసినవారని జిల్లా జిల్లా అంతకీ తెలుసు. మా పిల్లలను మీరు దిద్ది తీర్చాలి. ముఖ్యంగా బాపనపిరికి అనే అపప్రథ మీరు పోగొట్టాలి" అన్నాడు భట్టాచార్యుడు.

"చిత్తం చిత్తం, నేను తమ యెదట మాట్లాడగలవాణ్ణి కాను. అయితే, బ్రాహ్మణోత్తముల పిరికితనం శారీరికం కాదండి, మానసికం"

"అంటే?"

"నే నిదివరలో అయిదారుగురు బ్రాహ్మణయువకులకీ విద్య నేర్పాను. వారందరూ నన్ను మించినవారయినారు. కాని సమయం వచ్చేటప్పటికి మాత్రం వేదాంతచర్చలో పడిపోతారు. "ఏమి శాశ్వతం?" అన్న భావన మంచి రసకందాయప్పట్టులో వారిని దిగతీసేస్తూ వుంటుందండి"

"చాలా లోతయిన మాట యిది"

"నా దొక్క మనవి" అన్నాడు కొండుశ్రౌతి.

"ఏమిటోయ్?"

"బ్రాహ్మలనే కాదండి, హిందువుల నందరినీ నిర్వీర్యం చేసేసిందా భావన. తరతమభేదాలు మాత్రం వున్నాయంతే. కాకపోతే; మనదేశం అన్యాక్రాంతం అయినప్పుడల్లా పైనుంచి వచ్చినవారు మనకంటే చాలా తక్కువే. అయినా మనకి పారతంత్ర్యం యెందుకు వచ్చిందీ?"

"దానిమీద నువ్వు వాదం పెంచు, చూతాం"

"ఉత్తరభారతభూముల్లో కల్లోలాలు చెలరేగినప్పణ్ణుంచీ యీవిషయమై నేను మథనపడుతూనే వున్నాను. నెలరోజుల క్రిందట, తన్నాశించివచ్చిన ఒక పెళ్లికొడుకుని అన్నపూర్ణ అడిగిన ప్రశ్నతో చరిత్ర నాకు బాగా అవగాహన అయిపోయిం దండి"

"ఏమిటో ఆకిటుకు ?"

"గ్రామంలో శవం వుంటే పొయ్యిలో నిప్పు వేసుకోని సంప్రదాయం మనది; కాని యెప్పుడు వచ్చినా, మనిషిని చంపి, ఆశవంమీద కూచునే రొట్టె తినే జాతులతోనే వచ్చింది మనకి సంఘర్షణ. మన జగన్మిథ్యాత్వసిద్ధాంతం మనకు సకలమూ అశాశ్వతమే చేసేసింది"

"ఆగు" అన్నాడు భట్టాచార్యుడు.

రామశాస్త్రిని సంబోధించాడు.

"ఏమి సెలవు ?"

"మనకి స్వాతంత్ర్యం వచ్చింది"

"చిత్తం వచ్చిండి"

"ఇది యెలా వచ్చిందీ అని కాదు, యెలా నిలుస్తుందీ అనీ ప్రశ్న"

"అదీ మాట"

"ఆధ్యాత్మికత పేరుచెప్పి కడుపులు మాడ్చుకోడమూ, వరాలు కుంగదీసేసుకోడమూ అవివేకం"

"చిత్తం"

"శ్రౌతి చెప్పింది చారిత్రికవిషయం. అక్షరాలా జరిగింది. ఊహగానం కాదు"

శ్రౌతి మొగం వికసించింది.

"సెలవిప్పించండి" అన్నాడు శాస్త్రి.

"గతం గతమే. ఈవాదాలు కావు మన కిప్పుడు తార కాలు. కాగా సాముగరిడీల విషయమై నేనూ నీ నిశ్చయాని కే వచ్చాను"

శాస్త్రి సోల్లాసంగా చూడగా, యువకులు ఆనంద తాండవం చేశారు.

అప్పుడు భట్టాచార్యుడు దూరాన వున్న సూరిశాస్త్రి కేసి చూశాడు.

వెంటనే అతను కొంచెం ముందుకి వచ్చాడు.

"ఇతణ్ణి నువ్వెరుగుదువు" అన్నాడు భట్టాచార్యుడు రామశాస్త్రితో, సూరిశాస్త్రిని నిర్దేశిస్తూ.

"అయ్యో, అసహాయశూరుడు కదా అతను? ఈవూళ్లో యెరగనివా రెవరు?"

"ఇతనికిన్నీ సాముగరిడీలు నేర్చుకోవా లని సంకల్పం కలిగింది"

"చిత్తం, అవశ్యమూ పంపించండి"

"అన్నపూర్ణ సాముగరిడీలు ప్రారంభించిన సంగతి నాకు ఆక్షణంలోనే తెలిసింది. ఆసాయంత్రమే యితని ఉబలాటం కూడా నాకు తెలిసింది. నేను నీ దగ్గిరికి బయలుదేరదా మను కుంటూ వుండగా, పెల్గ్రాం రావడమూ, ఆరాత్రే మేము దక్షి

ణాదికి బయలుదేరడమూ జరిగిపోయాయి. ఇవాళ ఉదయమే తిరిగి యింటికి చేరుకున్నాం. ఒక్క నెల రోజులు వెనకబడి పోయానే అని యితను మహాపరితపించిపోతున్నాడు"

"వా రలా పరితపించడం అనవసర మండి" అన్నాడు సీతాపతి.

"ఏమిా?"

"వారి సంగతీ, సత్తా నాకు బాగా తెలుసు. ఈశ్వరుడు వారి కలాంటి శరీరం అనుగ్రహించాడు. విద్య ప్రారంభించిన నెలరోజులకు, ఆయన, మాకంటే వొక్క సంవత్సరం ముందుంటా రండి"

వెంటనే చెయ్యెత్తి నమస్కరించి, సూరిశాస్త్రి, సీతాపతికీ తన కృతజ్ఞత నివేదించుకున్నాడు.

"మిా కందరికీ అంత ఆదరభావం వుంటే యితని కిక లోటేమిటీ? నిజాని కితని ప్రతిభ సామాన్య మైనది కాదు, నాకు బాగా తెలుసు. కుంభకోణంలో మెలాంటి ఉద్దండ పండితులనూ చెలిగిపారేశాడు. ఇతని శరీర ప్రకృతి కూడా చాలా మంచిది. సాముగరిడీలకు బాగా అనుగుణం అయింది"

ఇది విని శ్రౌతినీ, సుబ్బయ్యనీ పిలిచాడు శాస్త్రి.

"విన్నారు కదా? ఇతను మహాపండితు డయిపోతాడు, సందేహం లేదు. ఇలాంటివాడు మన పాఠశాల విద్యార్థి కావడం మనం గర్వించతగ్గవిషయం".

"చిత్తం" అన్నారు వారిద్దరూ, ఏకకాలంలో.

"ఇంతకీ:– ఇక్కడ వారాలు చేసుకుంటున్న విద్యార్థులు,

ఇళ్ల దగ్గిర ధనికులా పేదలా అన్న విచారణ మన కక్కర లేదు. విద్యలకోసమే వారు మన వూరు వచ్చారు. తలి దండ్రులను విడిచివచ్చారు కనక, సర్వవిధాలా మనం ఆదుకుని విద్యార్జనకు వారి కవకాశాలు కలిగించవలసిన బాధ్యత మన మీద వుంది"

సూరిశాస్త్రి పరవశు డయిపోయాడు.

"కనక, వారిదగ్గిర మనం —"

రామశాస్త్రి మాట కడ్డంవచ్చి "యిత నిచ్చుకోవలసిన జీతం నే నిచ్చుకుంటా నయ్యా" అన్నాడు భట్టాచార్యుడు.

దీనిమీద సుబ్బయ్యని పిలిచి "ఏం, భట్టాచార్యులవారు సెలవిప్పించింది విన్నారా?" అనడిగాడు రామశాస్త్రి.

"శివశివా, వారి ద్రవ్యం నేను జీర్ణం చేసుకోగలనా మహాప్రభూ?" అని బదు లడిగాడు సుబ్బయ్య, వంగి వంగి దండాలు పెడుతూనూ, పరితపిస్తూనూ.

౭

"సుబ్బయ్యశాస్త్రీ, ఇవాళ సరస్వత్యుద్వాసన చేసుకోవలసిన రోజేమిటి —"

"ఇంకేం, నువ్వు సరిగానే చెప్పావు. ఈసాముగరిడీలు ఎప్పుడు ప్రారంభం అయినాయో అప్పుడే అయిపోయింది సరస్వత్యుద్వాసన, యీ అగ్రహారంలో"

"బాగా చెప్పావు. అయితే, నాకూ వచ్చింది గానీ ఆహ్వానం, జరుగుతున్న దేమి టంటావ్?"

"పాఠశాల ప్రారంభం అయి సంవత్సరం నర దాటిందిట. ఆవిద్య నేర్చినవాళ్లకి విజయదశమి మహాపర్వదినం ట. కుర్రాళ్లేమాత్రం ముందుకి వెళ్లారో చూసుకుందా మని కులాసాగా యివాళ పరీక్ష పెట్టుకున్నారుటయ్యా"

"అందులో పడి భ్రష్టు లయిపోయినవా ళ్లేమి చేసుకుంటే మనకేం, తక్కినవాళ్ల మాట చెప్పవోయ్"

"తక్కినవాళ్లంటూా యెవ రున్నారూ నువ్వూ నేనూ తప్ప? మనవూరి పండితు లంతా అక్కడే వున్నారు ఆడ వాళ్లతో సహా, తెలుసా?"

"కలి, ఘోరకలి"

"కలో కృతమో ప్రవాహం అలా మళ్ళిపోయింది, యిక నీధర్మశాస్త్రమూ నా మంత్రశాస్త్రమూ యెవడి క్కావాలీ? మా ఆవిడే పరుగె త్తింది, వంట ముసలివాని కప్పగించి"

"అయ్యో"

"అయ్యో అంటే, పోనీ, ముసల్దయినా మడి కట్టుకుందా? అది అలా చెప్పకుండా వెళ్ళింది, ఈవిడ గోదావరి కని పేరు పెట్టి యిలా చెప్పకుండా వెళ్ళింది"

"మా ఆవిడా వెళ్ళింది లే, అంతతొందర అయితే నన్ను మడికట్టుకోమని, అదిసరేగాని — అనేక వేలమంది బ్రాహ్మణ కుర్రాళ్ళని వేదవేదాంగవేత్తలను చేసి - విడిచిపెట్టిన యీ పాటిమీాది బ్రాహ్మలు వీరముష్టికి శిష్యరికం చెయ్యడం యేమిటోయ్!?"

"వీరముష్టో, గోరుముష్టో – అదిగో, మీ ఆవిడ వచ్చేసింది యేమి జరిగిందో విందాం"

"...... ఏమి తమ్ముడూ, నువ్వు రాలేదూ అక్కడికీ, మా మరదలితోనూ?"

"మీ మరదలితోనా? చూశావుటోయ్ శాస్త్రీ ఆధోరణి? ......... చాలించు ఇక. ఆపిండివంట యేమిటో తొరగా వండు, నే నన్నమూ పప్పూ కూరా చారూ కానిచ్చి పూజ కూడా చేసేశాను లే"

"మరి మైలపడి కూచున్నా రేం?"

"ఆడదానిలాగ పొయ్యిదగ్గిర పడివుండనా?"

"మా కళ్ళు కప్పి యింతవరకూ ఆడారు ఆట, యిక గుర్రం దిగండి"

"అదేమి టమ్మా అక్కా? ఏమి జరిగిం దేమి టక్కడ?"

"అక్కడ వుండినంతసేపూ మాకు చచ్చినచా వయిపోతే, ఏమి జరిగిం దని నింపాదిగా అడుగు తా వేమిటి తమ్ముడూ?"

"అదేమి టమ్మా?"

"మా బతు కేమి బతుకోయ్? పురుగులం కదా మేము? వాళ్ళ అన్నపూర్ణని చూడూ. వాళ్ళ శ్యామలను చూడూ. తక్కిన ఆడపిల్లలను కూడా చూడూ. పెటిపుట్టారు వాళ్ళు, యీ కాలంలో పుట్టి. దిక్కుమాలిన కాలం అయిపోయింది మాది"

"విశేషా లేమిటో చెప్పవమ్మా తిట్టుకోకా"

"విశేషా లన్న విశేషాలా? మొదట వాళ్ళ శ్యామల

కత్తి తిప్పిందయ్యా! చూడ్డానికి పదకొండేళ్ళ పిల్లే కాని కత్తి తిప్పాటప్పుడు బంతిలాగ యెగిరిపోయిందోయ్"

"సరే"

"తరవాత దాన్ని పడుకోబెట్టారు. శ్రౌతి రెండు బొంత అరిటికాయలు పట్టుకువచ్చి దాని కడుపుమీద పెట్టాడు. ఆపళంగా, పరవళ్ళు తొక్కుకుంటూ, వాళ్ళ గురువుట యములాడు లాగ తెగబారెడు కత్తి పుచ్చుకువచ్చాడు"

"వచ్చి?"

"శ్యామల కడుపుమీద వొక్క నరుకు నరికాడయ్యా"

"అయ్యో"

"మేమూ నీలాగే అయ్యో అనుకున్నాం. కళ్ళు కూడా మూసేసుకున్నారు కొందరు మొగాళ్ళున్నూ; కాని అరిటికాయలు రెండూ నాలుగు ముక్కలయి కింద పడిపోయాయి; గాని కసింతయినా దెబ్బ తగిలిందా దానికి మరి?"

"గొప్ప విద్యే చూపించాడు గురు వయినందుకు"

"గురువు మాటకేం, శ్యామల ధైర్యంమాట చెప్పవయ్యా! లక్షమంది మొగాళ్లు వచ్చి మీద పడినా అది జంకుతు దంటావా యిక?"

"నీకోరిక అలా వుందా?"

"ఏం వుండకా? కర్మం చాలక కూరలో కాస్త కారం తక్కు వయితే పరవళ్లు తొక్కడమా? ఒకనాడు కాస్త బద్ధకిస్తే "పో, పో, పుట్టింటికి పో" మ్మనడమా? శ్యామలనూ అన్నపూర్ణనూ చూశాకయినా మాస్థితి మాకు తెలియ

దనుకున్నారా? మే మింకా మునపటిలాగే పడివుంటా మను కుంటున్నారా?"

"బావతో నీకు వాదం యేమిటి గానీ — పడివుండనూ వద్దు గానీ — తరవాతి సంగతి చెబుదూ"

"శ్యామల వెళ్ళిపోగానే ఆడాళ్లకీ మొగాళ్లకీ గూడా పాతిక నిమ్మపళ్లు పంచిపెట్టాడు శ్రౌతి"

"అవెందుకూ?"

"కత్తి తిప్పాటప్పుడు వాటితో అన్నపూర్ణని కొట్టుమని"

"ఓహో, తరవాత అన్నపూర్ణ కనపరిచిందా విద్య?"

"విద్యన్నీ విద్యా తమ్ముడూ అదీ? కళ్లు చెదిరిపోలేదూ అందరికీ?"

"ఇప్పుడు నువ్వు మీా తమ్ముడి గుండెలు చెదరగొడు తున్నావు, తెలుసా?"

"బావకీ వినా లని తొందరగానే వుంది, ముందుకి వెళ్ల వమ్మా"

"పట్టాకత్తులుట వాటిపేరు. బారెడేసి వున్నాయి. అలాం టివి రెండు చేతులా రెండు కత్తులు పట్టుకు చక్కా వచ్చిం దయ్యా అన్నపూర్ణ. దాన్ని చూశాటప్పటికి, పట్టిసం కొండ మీాది భద్రకాళీ అమ్మవారు దిగివస్తున్న ట్టనిపించిం దయ్యా మాకు. ఇక అది కత్తులు తిప్పింది తమ్ముడూ! — నిజంగా తాండవం చేసేసిందయ్యా! ఆచురుకు — ఆ లాఘవం — ఆ స్ఫూర్తి — ఆనేర్పు — నేను చెప్పలేనయ్యా!"

"సరే, గొప్పగా వుంది. అద్భుతంగా వుంది. తరవాతా?"

"ఆ మెండలో ఆకత్తులు మెరుపుతీగ లయిపోయాయి. అప్పుడు మేమంతా – మీ మొగాళ్లు కూడా సుమీ – ప్రాణాలు గుప్పిట్లో పట్టుకున్నాం, చేతులు జారి అవెక్కడ మీద పడిపోతాయో అని. తగిలితే పెచ్చోపెచ్చో యెగిరిపోవలసిందే, అంత పదునుగా వున్నాయి మరి అవి"

"సరే, అలాంటి కత్తులు తిప్పింది అన్నపూర్ణ"

"అది అలా తిప్పుతూ వుంటే, ముందు వాళ్ల శ్యామల విసిరింది నిమ్మపండు. తరవాత సత్యవతి విసిరింది. శక్తికొద్దీ విసిరాడు శ్రౌతి. "విసిరెయ్యండి" అని వురిమాడు గురువు. అందరమూ విసిరేశాం"

"విసిరితే?"

"ఒక్క పండయినా దానికి తగిలితేనా? ప్రతీపండూ రెండేసి పెచ్చు లయిపోయింది. ప్రతీపెచ్చూ మాకు ఛెళ్లూ ఛెళ్లూ తగిలింది. అంతా అయిపోయాక, ముక్క లన్నీ పోగుచేసి, శ్రౌతి మా యెదట లెక్కపెట్టాడు. యాభయ్యాతేలాయి"

సుబ్బయ్యశాస్త్రి ముక్కు మీద వేలుపెట్టుకున్నాడు.

"ఎందుకు తమ్ముడూ, నాకు కాలం చెల్లిపోయి –"

"తప్పుతప్పు, నలభై యేళ్లకే ముసలిదా న్నయిపోయా నంటూ వేమిటమ్మా?"

"ఆ విద్యకి పనికివస్తా నంటావా మరీ? అది చెప్పవయ్యా యిచ్చకం మాట లాడక"

"దాని కేం గానీ – కొత్తవిద్య ప్రారంభించినందుకు వొడ్డెక్కిం దన్నమాటే అన్నపూర్ణ"

"అప్పుడే అంటా వేమి టా మాట? మధ్యాహ్నం చూడాలిట దాని సత్తా. శ్రోత్రి కూడా మిగిలే వున్నా డింకా"

"తక్కినవాళ్లు?"

"చాలామందే వున్నారు; కాని వాళ్లలో బాగా తేరుతున్న వాళ్లనే యేరి ఆడించారు. బాగా చేతకానివాళ్లనీ, కొత్తవాళ్లనీ వెనక్కి పెట్టేశారుట లే"

"సరే"

"ముందు శ్యామలా రామలక్ష్మి కుస్తీ పట్టారు. శ్యామల పడిపోయింది. రామలక్ష్మిని చేబోలువారి సుబ్బలక్ష్మి పడగొట్టింది. దాన్ని ప్రభలవారి నీలమ్మ పడగొట్టింది. శ్రోత్రి చెల్లెలు సత్యవతి, ముందు నీలమ్మని పడగొట్టింది. తరవాత, దానిమీదికి రామచంద్రుణ్ణి పంపారు. వెకిలిమనిషి వాడు, రూలుకి వ్యతిరేకంగా కుస్తీ పట్టాడుట. ఆపళంగా సాగతీసి అది ఛెళ్లున వాడి దవడ బద్దలుకొట్టింది. తమ్ముడూ, చెప్పవద్దూ? ఆదెబ్బకి వాడి పళ్లూడిపోయా యనుకున్నాం మేము"

"వాడి బతు కెందులోనూ అం తేలే"

"నువ్వు మనిషివి కాదంటూ వచ్చి, వాణ్ణి, గురువుకూడా పడగెంటేశా డయ్యా, పురుగుని తోసి పారేసినట్టు"

"వాడి మాట కేం గానీ – సత్యవతి, చివరికి, సత్యభామ అయిపోయే టట్టుంది"

"కావా లయ్యా, దేవుడి పుణ్యాన ముమ్మాటికీ కావాలి"

"కావాలి, సరే"

"అది రుద్రప్ప చేతిలో పడిపోయింది. రుద్రప్పని కృష్ణ

యజ్వ కొట్టాడు. కృష్ణయజ్వనీ, భోగప్పనీ, నరసావధానినీ సీతాపతి కొట్టాడు. సీతాపతిని సూరిశాస్త్రి పడగొట్టాడు"

"దరిద్రుడు – వారాల విద్యార్థి చేతిలోనా పడి పోయాడు?"

"వారాల విద్యార్థి యేమిటి తమ్ముడూ, సీతామహా లక్షుమ్మా భట్టాచార్యులుగారూ అతణ్ణి అభిమానపుత్రుడుగా పెంచుకుంటూ వుంటేనూ! ఆరు మాసాలయింది అతను వారాలు మానేసి"

"అదేమిటమ్మోయ్? నాకు తెలవనే లేదు సుమా"

"సరే గానీ, ఇంత అగ్రహారం వుంది క , అందరూ పండితులేకదా, అందరూ ధర్మపన్నాలు విడేసే రే గదా, సూరిశాస్త్రి తప్ప, పొద్దున్న లేచీ లేవగానే వొక్కడయినా తల్లికీతండ్రికీ పాదాభివందనం చేస్తాడూ మరి?"

"అబ్బా, గొప్పభక్తే"

"ఆభక్తీ, ఆనిష్ఠా కాయవుటయ్యా అతణ్ణి?"

"కాస్తాయి, కాస్తాయి"

"ఇక శ్రౌతీ అన్నపూర్ణా మిగిలివున్నారు. వాళ్లు కూడా సూరిశాస్త్రిని కొట్టలేరుట; కాని చూడవలసిన దంతా మధ్యాహ్నమే వుందిట"

"ఏమి బావా, ఏమంటావ్?"

"నువ్వే మంటావ్?"

"ఇక నే నాగ లేను"

"అయ్యో"

"ప్రతిష్ఠ విడిచిపెట్టలేకపోతే నువ్వు –"

"ప్రతిష్ట కేం గానీ – అంతమందికి లేని అప్రతిష్ఠ మన కేమిటిగానీ –"

"వేషాలు వెయ్యక బయలు దేరవయ్యా"

"నువ్వంత వుబలాటపడుతూ వుంటే యెందు క్కాదనాలీ? బయలు దేరవోయ్. దొమ్మరిసాని గడెక్కి ఆడితే చూశాం, మానామా?"

"విన్నావుటమ్మా?"

"దొమ్మరిరాజు డోలు వాయిస్తేనే దొమ్మరిసాని గడెక్కడం, నీ కిది తెలుసుటయ్యా?"

"....................."

౮

భట్టాచార్యుడి పాదాల దగ్గిర కూచుని వున్న సూరిశాస్త్రి, సుబ్బయ్య పిలవగా, వెళ్లి రంగస్థలం మధ్య నుంచున్నాడు, గోదావరిలో పట్టిసం కొండలాగ.

కరతాళధ్వనులు మిన్నుముట్టాయి.

"అన్నపూర్ణ, అన్నపూర్ణ" అనుకుంటూ అందరూ అటే చూశారు; కాని సుబ్బయ్య శ్రోతిని పిలిచాడు.

"హుషార్, ... ... హుషార్" అంటూనే సుబ్బయ్య తప్పుకున్నాడు, కుస్తీ ప్రారంభం అయింది.

"తగిన వుజ్జీ" అనుకుంటూ పొద్దుటిపూట వోడిపోయిన వారున్నూ మహోత్సుకు లయినారు.

ఠెల్లించి చూస్తూ సూరిశాస్త్రి పంజా చాపి వూరు కున్నాడు; గాని నిమిషాలు గడిచినా శ్రోత్రి అది పట్టుకోలేక పోయాడు.

చూసిచూసి శ్రోత్రిమెడ వొడిసి పట్టుకున్నాడు సూరిశాస్త్రి.

శ్రోత్రి మహోగ్రుడైపోయాడు, సూరిశాస్త్రి వొళ్లు మరిచిపోయాడు.

సభ కిటకిటలాడిపోతోంది.

స్త్రీలు పురుషులు – పిన్నలు పెద్దలు – అగ్రహారాని కగ్రహారం అంతా అక్కడ చేరి వుంది.

రామశాస్త్రి యేర్పాటు చొప్పున, ఏకుటుంబాని కా కుటుంబం ఒక్కొక్క గుంపుగా కూచుని వుంది, అందరితోనూ కలిసి.

ఎటు చూసినా వందలాది పురుషుల మధ్య, అంతసభలో, పీటలమీద కూచున్నట్టు తమ పురుషుల దగ్గిర కూచోడానికి, స్త్రీలు, పొద్దుటిపూట చాలా ముక్కటపడ్డారు; గాని యువతుల బలపరాక్రమాలూ, ధైర్యసాహసాలూ చూసి, పునర్జన్మ మెత్తినట్టయి "మా తక్కువ యేమిటీ?" అన్నట్టు కణా ళుంచుకునే కూచున్నా రీపూట.

అంతవరకూ సాముగరిడీలు ప్రారంభించి వుండని ఆడపిల్లలు ఎప్పుడెప్పుడని ఆత్రపడసాగారు, కొత్తగా కాపరాలకు వెళ్లి వుండిన పడుచులు "అయ్యో, కట్టుళ్లలో పడిపోయామే" అని కుసిల్లిపోసాగారు.

శ్రోత్రి చెల్లెలిని చూసి బాలవితంతువులు మాత్రం తిరగ బాటుచెయ్యడానికి నిశ్చయించేసుకున్నారు.

"ఎప్పుడో వుప్పెన తప్పదు" అనుకుంటూ కొందరు పురుషులుకూడా బిక్కుబిక్కు మంటూనే కూచున్నా రక్కడ.

వారిలో వొకడు "కాని – ఆడాళ్లనీ మొగాళ్లనీ కలపటం చెయ్యకపోతే అంత ఘోరకలిగా వుండకపోవు" నని పక్క శాస్త్రులతో మెల్లిగానే గొణిగాడు; కాని అది పసికట్టేసి, వొకప్రౌఢ, చెవిలో యేదో చెప్పడాని కన్నట్టు పక్క యువతి మీదికి వాలి "మనకి రాని విద్య లేమున్నా యే? ఇంకా యెన్నాళ్లే మన మిలా పడివుండడం?" అనడిగింది మెల్లిగా, ఆపురుషోత్తముని చెవికి తగిలేటట్టు.

మొత్తాని కక్కడి స్త్రీల మొగాలమీద – దిటవు, దిగులు, తెగువ, గుంజాటన, ఆశ, నిరాశ, నిర్వేదం, అసంతృప్తి, చిరాకు, రోషం – అలా అలా పాకిపోతున్నాయి.

విషపుచూపులు, ఆదరాపుచూపులు, లోతుచూపులు, అభావపుచూపులు, వంకరచూపులు, కోరచూపులు, వెకిలి చూపులు, గడ్డుచూపులు, వెర్రిచూపులు, పెంకిచూపులు, కిందిచూపులు, ఓరచూపులు – అన్నీ ఫోటోలెన్సు లయి పోయి వున్నాయి.

ఏనుగూ యేనుగూ ఢీకొన్నట్టూ, కొండమీద కొండ పడ్డట్టూ పెనగులాడుతున్నారు శ్రౌతీ, సూరిశాస్త్రీని.

కాని వొక్క అరగంట గడిచాటప్పటికి కుస్తీ అంటే, యిటు సూరిశాస్త్రికి ఆట కాదనీ, అటు శ్రౌతికి చావుబతుకుల సమస్య అనీ బోధపడిపోయింది.

దాంతో, ఇద్దరికీ కసి పెరిగిపోయింది.

ఇద్దరికీ రోషం యెక్కువయిపోయింది.

ఇద్దరకీ శౌర్యమున్నూ ముంచుకువచ్చేసింది.

ఇద్దరూ చివరి ప్రయత్నంలో పడ్డారు.

సభ్యులు వూగిపోయారు; కాని ఆ స్థితిలో పదినిమిషాలు గడిచాటప్పటికి శ్రౌతి కళ్లల్లో నిరాశ పొడచూపింది.

"హుషార్......హుషార్" అంటూ చుట్టూ తిరుగుతూనే మరో రెండు నిమిషాలు చూసి "శాస్త్రీ, విడిచిపెట్టెయ్యి" అన్నాడు సుబ్బయ్య.

తూల్తూ తూల్తూ లేచి, మెప్పుగా సూరిశాస్త్రికి షేకుహాండున్నూ యిచ్చి "పులి, పులి" అంటూ వెళ్లి విద్యార్థుల మధ్య చతికిలబడ్డాడు శ్రౌతి.

మొదట మందంగా ప్రారంభం అయి, కరతాళధ్వనులు చివరికి వొత్తుగా మిన్నుముట్టాయి.

అదివరకే వుడికెత్తి వున్న అన్నపూర్ణ రక్తం దానా దీనా పొంగులువారింది.

ఇక ఆగలేకపోయిం దామె.

పరిస్థితులు గమనించలేదు, సుబ్బయ్య పిలుపు నిరీక్షించలేదు, రంగస్థలాని కొక్క వురు కురికేసింది.

గుండెలు దూసుకుపోయేటట్టు చూస్తూ, చెవులు గింగుర్లెత్తేటట్టు సింహనాదం చేస్తూ ఆడసింహంలా వురికింది.

ఆశౌర్యోద్రేకం చూసి పురుషులు చకితులు కాగా, స్త్రీలు ఉత్సాహభరిత లయినారు.

బరువుగా శ్వాస విడుస్తూ, మళ్లీ సుబ్బయ్య పిలుపు వచ్చే దాకా వెళ్లి తన స్థానంలో కూచుందా మనుకుంటూ వున్న సూరిశాస్త్రి, గభీ మని యెదురుతిరిగి, వురిమిచూస్తూ హుంక రించి, విలాసగా పంజా చాపాడు.

కాని సుబ్బయ్య అగ్గయిపోయాడు.

ఒక్కమాటు రామశాస్త్రి కేసి చురుగ్గా చూశాడు.

"అక్రమం – అధర్మం" అంటూ వురిమాడు.

అంతే.

"ఆడపిల్ల – భద్రం" అంటూ ముందు శాస్త్రిని హెచ్చ రించాడు.

"హుషార్ ... ... హుషార్" అంటూ ఉభయులనూ తరవాత సమంగా రెచ్చగొట్టాడు.

నీహారలేశాలు కూడా పరిశీలిస్తూ చివరికి చుట్టూ తిరగ సాగా డతను.

అప్పటికప్పుడే అన్నపూర్ణా, సూరిశాస్త్రీ రోషావేశంలో పడిపోయారు.

వారి కళ్లు నిప్పులు కక్కుతున్నాయి.

ఆవిరి కెరటాల్లాగ ఆగిఆగి బరువుగా వస్తున్నాయి ఊర్పులు.

లోపల్లోపలే లీనం అయిపోతున్న హుంకారాలతో కంఠ నాళాలు పొంగరించి పోతున్నాయి.

పురుషులు, అన్నపూర్ణ ప్రతీ కదలికలోనూ, తాము అబల లనుకుంటున్న స్త్రీలలో ఎంత శౌర్యం, ఎంత పరా

క్రమం, ఎంత సత్తా, ఎంత ఆత్మవిశ్వాసం తొణికిసలాడేదీ గుర్తించి చకితు లయిపోతున్నారు.

స్త్రీలు, తమ శక్తి తమకు తెలియక, ఎంత నికృష్టస్థితిని అజ్ఞానంవల్ల తమకు తొడగని భూషణం అని భావించుకుంటూ కులుకుతున్నదీ గ్రహించుకుని కుతకుతలాడిపోతున్నారు.

"హుషార్ ...... హుషార్" అంటూనే వున్నాడు సుబ్బయ్య.

విద్యార్థులు వొడుపులు గ్రహిస్తూనే వున్నారు.

ఈస్థితిలో, దిక్కుహరాలు ముఖరితా లయేటట్టొక సింహనాదం చేసింది అన్నపూర్ణ.

చూడగా, తన రెండు కాళ్లలోనూ, అన్నపూర్ణ తన కుడికాలుంచి మెడ్డించగా ముందుకి తూలిపోయి, సూరిశాస్త్రి, అతికష్టంమీద నిలవరించుకుంటున్నాడు.

కాని, కళ్లు మూసి మళ్లీ తెరిచాటప్పటికి రబ్బరుబంతిలాగ యెగిసినుంచుని మెరుపువేగంతో మళ్లీ తలపడ్డా డతను.

మొగం జేవురించిపోయింది.

కళ్లు జోతు లయిపోయాయి.

చూపులు చెరుకాకుబల్లే లయిపోయాయి.

శరీరం అంతా శౌర్యం అలుముకుపోయింది.

ఆ స్వరూపం చూసి, స్త్రీలు, మొదట మెరుపుదెబ్బ తిన్నట్టయిపోయారు; కాని మళ్లీ అంతలో నిలవరించుకున్నారు.

ఈమార్పు గుర్తించి, రామశాస్త్రి, తల పంకించుకుంటూ తనకి తానే ధన్యవాదాలు చెప్పుకున్నాడు.

ఈస్థితిలో గుండెలు పీచుమనే టట్టొక సింహనాదం విని పించింది.

చూడగా, రెండు చీలమండలూ వొకచేత కలియబట్టుకునీ, రెండో చేత కుడిజబ్బ వొడిసిపట్టుకునీ, చాపచుట్ట లాగ అన్న పూర్ణని అమాంతంగా పైకెత్తేసి పట్టుకుని, సగర్వంగా ఆత్మ ప్రదక్షిణం చేసుకుంటున్నాడు సూరిశాస్త్రి.

అది చూసి స్త్రీలు గుండెలమీద చేతులు వేసుకున్నారు.

శౌర్యం పరమావధి గుర్తించి పురుషు లుత్సాహవ్యగ్రు లయినారు.

అవ్యవధానంగా "ఆగు" అంటూ బొబ్బరించాడు సుబ్బయ్యా.

సూరిశాస్త్రి ఆగిపోయి అలాగే నుంచున్నాడు.

"దింపేసెయ్యి" అని మళ్లీ అరిచాడు సుబ్బయ్యా.

ప్రాణపద మైన వస్తువు లాగ అన్నపూర్ణని మెల్లిగా దింపి, పక్కగా నుంచున్నాడు మదగజం లాగ చురుగ్గా చూస్తూ సూరిశాస్త్రి.

అన్నపూర్ణ సిగ్గుపడిపోయింది.

చిగుళ్లు ఎండదెబ్బ తిన్న పూలచెట్టు లాగ మొగం వంచు కుని నిలబడిపోయిం దామె.

అప్పుడు మెప్పుగా చూస్తూ వెళ్లి, ముందు సూరిశాస్త్రి వీపుతట్టాడు సుబ్బయ్యా.

తరవాత, పులిలాగ అన్నపూర్ణ మొదటికి వెళ్లి "ఏమం టావ్?" అన్నాడు కరుగ్గా, చురుగ్గా చూస్తూ.

"ఓడిపోయా" నంది అన్నపూర్ణ, అలాగ మొగం వంచుకునే వుండి.

కాని సుబ్బయ్యకి తృప్తి కాలేదు.

ఒక్కమాటు రావిరేకల్లాగ కదిలిపోయాయి అతని పెదవులు.

"ఘోరమైన నేరం చేశావు నువ్వు. ఒకరితో కుస్తీ పట్టి, చిత్తున్నా చేసి, అలిసిపోయివున్నవాడిమీద చెప్పకుండా వెళ్లిపడ్డావు నువ్వు. శిక్షించకుండా నిన్ను విడిచిపెట్టడానికి వీలులేదు" అంటూ గద్దించాడు, అతను.

"నిజమే" అన్నట్టు ముందు తలవూపింది అన్నపూర్ణ.

"నే నమాంతంగా వెళ్లి మీద పడ్డం నిజమే. అయితే, శౌర్యం ముంచుకురావడం తప్ప, అందు క్కారణం దుర్బుద్ధి కాదు. దీనిమీద మీ రేమన్నా నేను మాట్టాడలేను. ఇందుకు మీ రే శిక్ష విధించినా తల వొగ్గుతాను" అందామె చివరికి, చేతులు జోడించుకుని, మొగం మాత్రం వంచుకునే వుండి.

వెంటనే, పడగవిప్పిన నల్లతాచులాగ, ఎదురొమ్ము విరుచుకుని బుస్సలుకొడుతూ, మొదట, నాలుగువైపులా చూశాడు సుబ్బయ్య.

అంతంత లేసి అగ్రహారీకులూ మంత్రించినట్టు బొమ్మలయిపోయారు, దాంతో.

కాని రామశాస్త్రి గభీమని లేచినుంచున్నాడు.

"సుబ్బయ్యగారూ" అనిన్నీ పిలిచాడు.

“ తానధర్మ యుద్ధానికి తలపడిందికనక, ఇందుకు శిక్షగా మా అమ్మాయి, సూరిశాస్త్రిని విధేయురాలై సేవించు కుంటుంది. మా అమ్మాయిని నే నతనికిచ్చి వివాహం చేస్తా నన్నాడు.

“ధర్మాధర్మాలు తెలిసినవారుకనక, తమరు విధించిన శిక్ష ఉభయతారకంగా వుం” దన్నాడు సుబ్బయ్య.

“ఇందుకు శిక్షగా, అధర్మయుద్ధానికి తలపడ్డావు కనక, బతికివున్నంత కాలమూ నువ్వితణ్ణి సేవించుకో. అందు కర్హత సిద్ధించడానికి ముం దితణ్ణి చేపట్టు. మహానుభావులు శ్రీ భట్టాచార్యులవారి ఆశీర్వచనం నెరవేరి తీరాలి, పర్వతరాజ పుత్రికవు నువ్వు, ఈ శాంబరీభిల్లుణ్ణి అనుసరించు” అనే శాడు చివరికి సుబ్బయ్య, తర్జనితో టొకాయిస్తూ.

అగ్రహారీకులు తుల్లిపడిచూశారు ; కాని అంత లజ్జా వహ మైన స్థితిలోనూ కూడా, దీంతో, పాదరసబ్బుడ్డిలో మెరుపులాగ, అన్నపూర్ణ కళ్లల్లో ముగ్ధప్రణయం భాసించింది.

సిందూరం చిలికినట్టు ఆమె గండస్థలాలు రక్తిమా లయి నాయి.

మొగం అరవిచ్చిన తామర మొగ్గ అయిపోయింది.

శరీరం అంతా గరిపొడిచింది.

మనస్సు గుబగుబలాడిపోయింది.

కాళ్లలో వొణుకు పుట్టింది.

వెంటనే, ఒక్కమాటు మొగం పైకెత్తి, సూరిశాస్త్రి గభీరదృష్టితో తన ముగ్ధదృష్టి మేళవించి, కులికిపోతూ మళ్లీ మొగం వంచుకుంది, తానే జయించినట్టు.

రాజేశ్వరి, తన పక్కనే కూచునివున్న భట్టాచార్యుని భార్య సీతామహాలక్ష్మమ్మ చెవిలో నోరు పెట్టింది, పొంగి పోతూ తన కుడిచెయ్యి ఆమె మెడకి చుట్టవేసి.

"తథాస్తు" అంటూ అంతకి ముందే ఉబ్బెత్తుగా లేచి నుంచున్నాడు రామశాస్త్రి, అన్నపూర్ణనీ సూరిశాస్త్రినీ, దీవిస్తున్నట్టు పైకెత్తి రెండుచేతులూ వూపుతూ.

— 1948 నవంబరు "కిన్నెర" నుంచి